కస్తూర్బా గురుకులంలో విద్యార్థులకు వైద్య శిబిరం

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని పెద్దకొర్పోలు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వతకార్యక్రమంలో భాగంగా గురుకులంలో వైద్య శిభిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వ హించారు. పాఠశాల ప్రత్యే కాధికారి రజిత ఆధ్వర్యంలో విద్యార్థులకు వైధ్యాధికారి స్వర్ణలత, భవిత, వైద్య బృందం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి జలుబు, జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు చికిత్స చేసి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కే సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలు

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే దొంతి

నవతెలంగాణ-నర్సంపేట

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందుతున్నాయని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో వివిధ మండలాలకు చెందిన 269 కళ్యాణలక్ష్మీ పథకం లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను అమలు చేసి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పీ.ఉమారాణి, తహసిల్దార్ రాజేష్, మార్కెటి కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసిల్దార్‌లు, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కోనారెడ్డి చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-వర్ధన్నపేట

వర్ధన్నపేట కోనారెడ్డి చెరువు నీటి సామర్థ్యం తగ్గిందని, చెరువును పరిరక్షించాలని కోనారెడ్డి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సోమవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ వర్ధన్నపేట మండలంలో అతిపెద్ద చేరువైన కోనారెడ్డి చెరువు 0.25 టీఎంసీల సామర్థ్యం గలదని, చెరువు పూర్వ కాలంలో నీళ్ల లేని సమయంలో నడిచి వెళ్లే దారులను కబ్జా చేసి సాగులోకి తీసుకురావడంతో సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ ఆక్రమణతో చెరువు విస్తీర్ణం తగ్గి వరద నీటికి 2020 సంవత్సరంలో ఆనకట్ట తెగిపోయిందన్నారు. చెరువు ఆక్రమణ పై జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ చొరవ తీసుకుని చెరువును పరిరక్షించాలని వారు వినతి పత్రంలో కోరారు. వందలాది ఎకరాలు ఎఫ్‌టిఎల్ భూభాగం అన్యాక్రాంతమై కాలక్రమమైన చెరువు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. దమ్మన్నపేట, జగ్గిపేట, గన్నారం గ్రామాలకు వెళ్లే పూర్వపు బండ్లబాట ఆక్రమించుకొని సాగు చేయడంతో పాటు కట్టలు పోసారన్నారు.చెరువు మత్తడి సామర్థ్యం 234 మీటర్లకుగాను 50 మీటర్లకే పరిమితమైందన్నారు 478 ఎకరాల విస్తీర్ణం గల చెరువు భూభాగం నీటి సామర్థ్యం తగ్గిపోయిందనీ వినతిపత్రంలో కోరారు. ఇప్పటికైనా చెరువును పరిరక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గోధుమల మధు, సిలువేరు కుమారస్వామి, తుల్ల కుమారస్వామి, మార్గం బిక్షపతి, గుజ్జా సంపత్ రెడ్డి, రహీం సురేష్ ,చొప్పరి సోమయ్య, రాజు పలువురు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంతో చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పర్వతగిరి

రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కల్లెడకు చెందిన దుగ్యాల వసంతరావు(65) తన ద్విచక్ర వాహనంపై నెక్కొండ మండలం రెడ్లవాడకు పనిమీద వెళ్ళాడు. పనిపూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో పర్వతగిరి పోలకమ్మ చెరువు కట్ట వద్దకు రాగానే తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కట్ట పక్క భాగంలో ఉన్న రేలింగ్ రాతికబికి ఢీ కొట్టడంతో టూవీలర్ కట్టపైన పడి వసంతరావు కట్ట సైడుబాగం నుంచి దొర్లుకుంటూ చెరువులో పడి మృతి చెందాడు. అప్పటికే అతని తలకు, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా వసంతరావు మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.



నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

ఎస్‌ఆర్‌ఆర్ సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-రాయపర్తి

బీఆర్‌ఎస్ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని ఎస్‌ఆర్‌ఆర్ సంస్థల అధినేత, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఐత జంపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగ అతని పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పిదప కొత్తూరు గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బొమ్మిదేని నారాయణ సతీమణి దేవకమ్మ, పెర్కవేడు గ్రామానికి చెందిన మంచాల మల్లమ్మ, ఊగా యాకయ్య ఇటీవల మతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తలా 50కిలోల బియ్యం వంటనూనె అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు కష్టసుఖాల్లో వెన్నంటే ఉంటా అని తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అండదండలు ప్రతి ఒక్క కార్యకర్తకు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతకుల రంగా రెడ్డి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, చెడుపాక కుమార్, సంధి దేవేందర్ రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గబ్బేట యాకయ్య, కొమ్ము రాజు, ఎల్లస్వామి, కోలా సంపత్, ఎండీ యూసఫ్, చందు రామ్, ఐత కుమార్, గారె నరేష్, ఐత రవి, ఐత రాజు పాల్గొన్నారు.



జోరుగా విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గోపనపల్లి దూడల మల్లిఖార్జునస్వామి దేవాలయం అభివృధి పునర్నిర్మాణంలో భాగంగా దూడల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధి కమిటీకి సోమవారం గోపనపల్లికి చెందిన గుండమాల రాజమల్లు-సమ్మక్క కూతుర్లు శిరీష,శ్వేత కుమరుడు సందీప్ ఆలయ పునర్నిర్మాణానికి 5,116 విరాళంగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన గుండమాల లక్ష్మీ-నరసింగరావుల జ్ఞాపకార్థం భార్య నిర్మల కుమారులు అఖిల్, అజయ్‌లు విరాళంగా రూ. లు.5,116 అలాగే అదే గ్రామానికి చెందిన కందుల భిక్షపతి-పద్మ దంపతులు రూ.లు 5,116 విరాళంగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన మంద దేవేందర్-లలిత విరాళంగా రూ. 5,116, అదే గ్రామానికి చెందిన వర్కాల సారయ్య-విజయ దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన గుండమాల అమర్నాథ్-అఖిల విరాళంగా రూ.5,116, అదే గ్రామానికి చెందిన గుండమాల సుధాకర్-రమ దంపతులు రూ .5,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.

'చే' జారిన ఎమ్మెల్సీ బెర్త్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో విలాపం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ బెర్త్‌ల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్ నుండి నేతలు పెద్ద సంఖ్యలో పోటీపడ్డా ఫలితం దక్కలేదు. ఈసారి ఈ రెండు పార్టీలకు చెందిన ఏ నేతకు అవకాశం దక్కకపోవడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీలో వేం నరేందర్‌రెడ్డితో పాటు దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పోటీపడగా, బీఆర్‌ఎస్‌లో ఒక్క స్థానానికి మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావులు పోటీపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన దొమ్మాటి సాంబయ్య కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. నాటి నుండి 'దొమ్మాటి'కి ఎలాంటి అవకాశం దక్కలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ శాసన సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టికెట్ నాశించి భంగపడ్డారు. అనంతరం వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ టికెట్‌నాశించినా ఆ అవకాశం ఆయనకు దక్కలేదు. నాటి నుండి నేటి వరకు మౌనంగా పార్టీలోనే కొనసాగుతూ వచ్చారు.ఈసారి ఎమ్మెల్సీ అవకాశం దక్కుతుందని భావించినా దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో వున్నారు. ఇదిలావుంటే గత శాసనసభ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్‌నాశించి నమిండ్ల శ్రీనివాస్ భంగపడ్డారు. నాటి నుండి 'నమిండ్ల' అసంతృప్తితోనే వున్నారు. 'నమిండ్ల' రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పదవిని ఆశించినా దక్కలేదు. ఇదిలావుంటే ఎమ్మెల్సీ ఛాన్స్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా భంగపాటు తప్పలేదు. వీరిద్దరూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి పేరు తొలి నుండి బలంగా వినపడింది. సామాజిక సమికరణలలో భాగంగా 'వేం'కు ప్రాధాన్యత నివ్వలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌కు 4 ఎమ్మెల్సీలు దక్కే అవకాశముండగా, మూడు కాంగ్రెస్, ఒక్క స్థానాన్ని సీపీఐకి ఇచ్చింది. మూడు స్థానాల్లో ఒకటి మహిళకు, ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్టీలకు కేటాయించింది.



బీఆర్‌ఎస్‌లో పోటీపడ్డా ..

బీఆర్‌ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్రంగా పోటీపడ్డారు. తన పదవీకాలం ముగిసే దశలో సత్యవతి రాథోడ్‌ను శాసనమండలిలో బీఆర్‌ఎస్ పార్టీ విప్‌గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరోమారు సత్యవతి రాథోడ్‌ను ఎమ్మెల్సీగా కొనసాగిస్తుందన్న చర్చ ఆ పార్టీలో సాగింది. ఈ క్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్సీ పదవి కోసం తీవ్రంగా కసరత్తు చేశారు. ఒకానొక దశలో ఈ ఇద్దరు నేతల మధ్యనే పోటీ వుందన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వీరిద్దరిని కాదని బీఆర్‌ఎస్ నాయకత్వం బిసి నేత దాసోజు శ్రవణ్‌కు అవకాశమిచ్చింది. ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు పోటీపడడంతో ప్రత్యామ్నాయకంగా బీఆర్‌ఎస్ మరో నేతకు అవకాశమిచ్చిందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇద్దరూ మంత్రులుగా పని చేసిన విషయం విదితమే. ఎమ్మెల్సీగా సత్యవతి రాథోడ్ కొనసాగగా, 'ఎర్రబెల్లి' గత శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు.

ఉమ్మడి వరంగల్‌కు దక్కని ఛాన్స్..

గత కొన్నేళ్లుగా ఎమ్మెల్సీ పదవుల విషయంలో ప్రతిసారి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు అవకాశం దక్కుతూ వచ్చింది. ఈసారి ఎమ్మెల్యేల కోటాలో ఎవరికీ, ఏ పార్టీ నుండి అవకాశం దక్కకపోవడం గమనార్హం. గతంలో కడియం శ్రీహరి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. ప్రస్తుతం మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, డాక్టర్ బండా ప్రకాశ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బస్వరాజ్ సారయ్య ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్నారు. ప్రతిసారి అవకాశం వచ్చినట్టే ఈసారి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు ఏ పార్టీ నుండైనా అవకాశం వస్తుందని ఆశించినా ఇందుకు భిన్నంగా అవకాశం దక్కకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-నర్సంపేట

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రాబోయే శాసనసభ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో చిక్కుకున్నదన్నారు. ప్రధానంగా సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులు అనేక మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మెస్ చార్జీలు పెంచామని ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. యేడాదిగా హాస్టల్‌లో మెస్ బిల్లులు చెల్లించనందున విద్యార్థులు నాణ్యమైన భోజనం అందకుండా పోతుందన్నారు. ఆరేండ్లగా వేల కోట్లు స్కాలర్‌షిఫ్, ఫీజు రీయాంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు, యూనివర్సిటీలకు చాలీచాలని నిధుల కేటాయింపు వల్ల కనీస మౌళిక వసతులు కొరవడ్డాయన్నారు. విద్యారంగంలో ఎదురైతున్న సమస్యలతో విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయాంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెంచిన మెస్ చార్జీలు అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం చార్జీలు పెంచాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భానోతు వినోద్ కుమార్, పైసా గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

లబ్ధిదారులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు..

ముగ్గు పోసి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని రామతీర్థం గ్రామంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, అర్హులైన నిరుపేద కుటుంబాలకు సోమవారం ముగ్గు పోసి భూమి పూజ చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు కాగా మొదటి దశలో నిరుపేదలైన అర్హులను గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గంలో 3500 ఇండ్లు నిర్మిస్తామని అన్నారు. ఇల్లు లేని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎవరైనా లబ్ధిదారులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, ఎమ్మార్వో కృష్ణ, ఎంపీడీవో నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.



అంతర్జాతీయ జూడో పోటీలకు అంధ విద్యార్థులు

అభినందించిన బల్దియా కమిషనర్

నవతెలంగాణ-వరంగల్

అంతర్జాతీయ స్థాయి జూడో పోటీలకు అర్హత సాధించిన అంధ విద్యార్థులను బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాలకు చెందిన యాజమాన్యం విద్యా ర్థులు సోమవారం ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల బాధ్యులు మాట్లాడుతూ ఫిబ్రవరి 24-28 వరకు ఉత్తం ప్రదేశ్ రాష్ట్రం లోని లక్నో లో జరిగిన 13 వ నేషనల్ పారా జూడో పోటీలకు అంధుల పాఠశాల కు చెందిన 9 మంది విద్యార్థులు జూడో పోటీలకు ఎంపికై అట్టి క్రీడల్లో పాల్గొని 5 గురు విజేతలుగా నిలిచి బంగారు వెండి కంచు పథకాలను సాధించడం జరిగిందని జి.వినోద్ కుమార్ పి.నాగరాజు అనే విద్యార్థులు మే 8-16 వరకు కజకిస్థాన్ దేశం లోని ఆస్తానా లో జరిగనున్న ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ సాధించాలనే తపన ఉంటే వైకల్యం అవరోధం కాదని అంధ విద్యార్థుల సంకల్పం గొప్పగా ఉందని అంతర్జాతీయ స్థాయి లో రాణించి నగరానికి వన్నె తీసుకువచ్చారని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని కమిషనర్ ఆకాంక్షించారు.అనంతరం క్రీడల్లో సాధించిన ట్రోఫీ మెడల్స్‌ను కమిషనర్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, కరస్పాండెంట్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.



లచ్యాతండాలో తాగునీటి కొరత

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గుగులోత్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని లచ్యాతండాలో గత ఐదు రోజులుగా నల్లాలు రాక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు,పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా కనీసం ట్యాంకర్‌తోనైనా తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి కొరతతో అల్లాడి పోతున్నాం

తండాలో తాగునీటి కొరతతో అల్లాడి పోతున్నామని, వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా అవసరాలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



బానోత్ వెంకన్న నాయక్
(బీఆర్ఎస్ యూత్ మాజీ ప్రెసిడెంట్)



ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వరంగల్

సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యా రాణి, వరంగల్ ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి,డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి పాల్గొని ప్రజల సమస్యల పైన వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు (103) రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆదివారం కలెక్టర్లతో సమీక్షించిన తీరును జిల్లా అధికారులతో సమీక్షించారు.

అర్ధనగ్న ప్రదర్శన చేసిన రైతు

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్ వంశ పారంపర్యంగా వచ్చిన భూమి సుమారు 5 ఎకరాల30 గుంటలు ఉన్నది చిన్న వాడైన గట్ల రాజు గ్రామంలో ఉండి భూమిని కాస్తు చేయుచు లబ్ధి పొందుతున్నాడు. గట్ల రాజు వద్ద పట్టాదారు పాసు బుక్కు ఉన్నదని నాచినపల్లి గ్రామానికి చెందిన గాదం కొమురయ్యకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. పట్టా పాస్బుక్కులను వెంటనే రద్దు చేయాలని వారితో ప్రాణభయం ఉన్నందున వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.ప్రజావాణి లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు



మహిళ ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలో పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను ఎంపీడీవో సునీల్‌రాజ్ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం రెండవ శనివారం సెలవు దినం కావడంతో సోమవారం మహిళా ఉద్యోగులను సన్మానించినట్లు వారు పేర్కొన్నారు. అన్ని రంగాలలో పురుషుల తోపాటు మహిళలు పోటీ పడి పని చేస్తున్నారని కొనియాడారు. మహిళల అభ్యున్నతితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని వారు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పథ్వీరాజ్, ఏపీవో సునీత, ఈసీ అరుణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు కాసుల రాంబాబు, సుధాకర్, బాలు, యుగేందర్, సురేష్, హుస్సేన్, జనార్ధన్, సట్ల సుప్రజ, అబేద బేగం, దోమల రజిత, దివ్య కల్పన, స్రవంతి, మాలతి, శ్యామల, గుణ స్రీలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గోరుగుట్ట తండాకు చెందిన బానోతు నవీన్ సోమవారం మరణించగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాగ్య నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ భాస్కర్ నాయక్, నాయకులు రవికుమార్, నెహ్రూ, సంతోష్, సుమన్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని వడ్లకొండలో శ్రీ రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కొరకు కీ.శే కొంగ సమ్మయ్య జ్ఞాపకార్థం వారి కుమార్తె గాడిపెల్లి స్వరూప-రాజేశ్వరరావు కూతురు మీసాల హర్షశ్రీ-రఘువెంకటేష్ దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు తమ వంతు సహాయంగా విరాళం రూ.25,116ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసినట్లు మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్ తెలిపారు.



క్రీడా కారులకు టీ షర్టులు పంపిణీ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కొంకపాకలో కల్చరల్ అండ్ యూత్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వ ర్యంలో సోమవారంఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో భాగంగా నిర్వాహకులకు, క్రీడల్లో పాల్గొనే క్రీడా జట్టులకు యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజక వర్గం ఉపాధ్యక్షులు బొక్కల ప్రమోద్ అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రమోద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



స్వేరోస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందికట్ల ప్రవీణ్

నవతెలంగాణ-పర్వతగిరి

స్వేరోస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రోళ్లకల్ గ్రామానికి చెందిన కందికట్ల ప్రవీణ్ ను సోమవారం నియమించినట్లు రాష్ట్ర నాయకులు పుల్లా కిషన్, మారేపల్లి మనోజ్, శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ జ్ఞాన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్వేరోస్ నెట్ వర్క్ పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కందికట్ల ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన స్వేరో నాయకులందరికీ కతజ్ఞతలు తెలిపారు. స్వేరో నెట్వర్క్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడంలో శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనందుకు మండల నాయకులు అభినందనలు తెలిపారు.





రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చుక్కయ్య

నవతెలంగాణ- ఐనవోలు

రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాని ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చుక్కయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ దగ్గర రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎం చుక్కయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతుల ఐక్యం చేసి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మండలంలోని రైతులు సమస్యలపై అధ్యయనం చేసి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అధికారంలోకి అన్ని పార్టీలు రైతు లేనిదే రాజ్యం లేదని, రైతులు సమస్యలు పరిష్కరిస్తామని అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికే రైతులు రుణమాఫీ, రైతు భరోసా ఇలాంటి సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చుక్కయ్య ప్రభుత్వంపై మండిపడ్డారు.

ఏఐకేఎస్ మండల కమిటీ ఎన్నిక

ఏఐకేఎస్ మండల నూతన కమిటీని 15మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మడిగే నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కొంకాల నారాయణరెడ్డి ఉపాధ్యక్షుడిగా కొంకటి శంకర్‌రెడ్డి, చిరంజీవి, భాస్కర్, గుండేకారి మహేందర్, బాబురావు, దీకొండ ఉప్పలయ్య, చిన్న మహేందర్, కొమురయ్య, యాకయ్య, లెంకల నరసయ్యలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య తెలిపారు. కార్యక్రమంలో మడిగే నాగరాజు, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, యాకయ్య, మహేందర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణకు యువత కృషి చేయాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఎయిడ్స్ నియంత్రణకు యువత కషి చేయాలని, దేశ భవిష్యత్తు యువతపై ఉందని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాకు చెందిన యువజన సంఘాల సభ్యులకు కాకతీయ యూనివర్సిటీ గణిత విభాగంలోని సెమినార్ హాల్లో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల అధ్యక్షతన లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత శారీరక సుఖాల కోసం పెడదోవ పట్టకుండా, లైంగిక విషయాల పట్ల అవగాహన పెంచుకొని, సన్మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం హనుమకొండ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ 15నుండి 20ఏండ్ల మధ్య వయసులో ఉన్న యువత ఎక్కువగా ఈ వ్యాధి గురవుతున్నారని, శారీరకంగా మానసికంగా దఢంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. మ్యాథమెటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, యూనివర్సిటీ డెవలప్మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డిలు మాట్లాడారు. అనంతరం వివిధ యువజన సంఘాల నుండి విచ్చేసిన బాధ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి స్టేట్ రిసోర్స్ పర్సన్ రిటైర్డ్ ప్రొఫెసర్ పింగళి నరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఐసిటిసి సూపర్వైజర్ ఆడెపు రామకష్ణ, మ్యాథమెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ భారవిశ్వర్మ, హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్వి రాజ్ కుమార్ వివిధ యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఈ నెల 11 నుంచి 13వరకు ఫాతిమా తిరునాళ్లు

విశాఖపట్నం అగ్ర పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుమల బాల

నవతెలంగాణ-ఎన్జీవోస్‌కాలనీ

ఈ నెల 11 నుంచి 13వరకు ఫాతిమా మాత తిరునాళ్ల నిర్వహిస్తున్నట్టు అగ్ర పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుమల బాల తెలిపారు. సోమవారం కాజీపేట మీడియా పాయింట్‌లో ఫాతిమా మాత తిరునాళ్ల మహోత్సవం-2025పై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడుమల బాల మాట్లాడుతూ ఫాతిమా మాత తిరునాళ్ల మహోత్సవాన్ని వరంగల్ పీఠం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే మూడు రోజులుకనుల పండగగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవదిన జపములు ప్రార్ధనలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మూడు రోజుల తిరునాళ్లలో భాగంగా మార్చి 11న వివాహితుల రజత,స్వర్ణ, జూబ్లీ వేడుకలు దంపతుల గహస్థ సేవల ప్రత్యేకమైన పండుగను నిర్వహిస్తున్నామన్నారు. 12న స స్వస్థత ప్రార్ధనలు, దివ్య పూజబలి, ఫాతిమా మాత స్వరూపంతో మహారాజ ప్రదక్షణ దర్గా, ఫాతిమా నగర్ పురవీధుల్లో ఊరేగింపు, ఫాతిమా ప్రధాన మహా ద్వారా తోరణం ప్రారంభం, జపమాల ఉద్యానవనం ప్రారంభం, సాంస్కతిక ,స్వస్థత దినోత్సవం, ముఖ్యంగా దివ్యాంగులకు సన్మానం, స్వస్థత చేకూరాలని ప్రార్ధనలు , అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతి ప్రధానం చేస్తామన్నారు. 13న దివ్య పూజ బలి, స్వస్థత ప్రార్ధనలు ,దివ్యపూజా పతాక అవరోహణం, ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి లక్షలమంది ప్రజలు 12జిల్లాల నుండి హాజరవుతారని జాతీ, కులం, మతం భేదం తేడా లేకుండా లక్షలాది మంది హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఫాదర్ కాసు మర్రెడ్డి ఫాదర్ టి జోసఫ్ ఫాదర్ పి సురేష్ ఫాదర్ ఎన్ సురేందర్ జి ఫాదర్ నవీన్ ఫాదర్ అనుకిరణ్ ఫాదర్ అశ్విన్ బొక్క దయాసాగర్, మత్యాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-నయీంనగర్

హన్మకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట సోమవారం ల్యాండ్ రిజిస్ట్రేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా రిజిస్టర్ డి ఫణిందర్ పాల్గొని మాట్లాడారు.ఎల్ఆర్ఎస్ మాడ్యూల్ ఇంప్లిమెంటేషన్, ఎల్ఆర్ఎస్ విధివిధానాలపై ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ విధానాన్ని మార్చి 31వ తేదీ వరకు కల్పించిన 25శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం దస్తావేజు లేఖరులు, రియల్‌టర్లు, ప్రజలు వారికి గల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ సబ్‌రిజిస్టర్లు రాం నరసింహారావు, ఆనంద్, రూరల్ సబ్ రిజిస్టర్ సైదులునాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో కలెక్టర్ సందర్శన

నవతెలంగాణ-నయీంనగర్



సుబేదారిలోని కాకతీయ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సోమవారం సందర్శించారు.ఈ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఏర్పాట్లను గురించి వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య వివరాలను, పరీక్షల నిర్వహణకు సంబంధించి అడిగి తెలుసుకున్నారు. కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను, పరీక్షా కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

దొంగచాటుగా తూము గేట్ల ఎత్తివేత

వృథాగా పోతున్న చెరువు నీరు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

పట్టించుకోనిఐబీ అధికారులు

నవతెలంగాణ-ఆత్మకూర్





చెరువుల్లోని సాగునీటిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగచాటుగా తూములు ఎత్తివేసి సాగు నీటిని బయటకు వెళ్లగొట్టడంతో మండలంలోని ఆత్మకూరు, కామారం గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చేపల కోసమే ఈ తతంగమంతా నడుస్తోందని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. సాగు నీటి వృథా వ్యవహారం ఐబీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని రైతులు మండిపడుతున్నారు. ఐబీ అధికారులకు ముడుపులు అందినట్లు ఉన్నాయి...? అందుకే నీరు వృథా అవుతున్నా చోద్యం చూస్తున్నారని పలు గ్రామాల రైతులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఐబీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తమకు పట్టనట్లుగా వ్యవరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాగునీరు బయటకు వెళ్లి బీడు పొలాల్లో నీరంతా చేరుతోందని, దీంతో తమ పొలాల్లోని పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. చెరువులు ఎండిపోవడం వల్ల తమ బావుల్లోని నీరు ఇంకిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కామారం, ఆత్మకూర్ ఊర చెరువుల్లో ఈ తతంగం కొనసాగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.కామారం చెరువు నీటిని బయటికి వదిలేయడంతో శివారులోని పంట పొలాలు మునుగుతున్నాయని,నీటి వృథా వల్ల వచ్చే ఏడాది చెరువు కింద పంటలు వేసుకోవాలంటే ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని కామారం గ్రామ రైతులు కాసర్ల శ్రీనివాస్, పెరుమాళ్ల రితీష్, మాదిరెడ్డి ప్రతాపరెడ్డి తదితర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఐబీ, రెవెన్యూ అధికారుల దృష్టికితీసుకు వెళ్లామని, ఐబీ డిఈ వేణుగోపాల్‌కి ఫిర్యాదు చేయగా 'మేము చెరువుల వద్ద కాపలా ఉంటామా, నీటి తొలగించిన వారి పేర్లు చెప్పండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని రైతులు విలేకరుల ఎదుట గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఇప్పటికైనా చెరువుల్లోని సాగు నీరును దొంగ చాటుగా తూములు ఎత్తి నీరు వృథా చేస్తున్న వారి పైన చర్యలు తీసుకొని మరోమారు ఇలా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పలు గ్రామాల రైతులు హెచ్చరిస్తున్నారు.ఈ విషయమై 'నవతెలంగాణ' ఐబీ డిఈ వేణుగోపాల్‌ను సాగు నీటివృథాపై వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

మహిళా లోకాన్ని తట్టిలేపిన ధీశాలి సావిత్రిబాయిపూలే

సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



స్త్రీ విద్య కోసం తన జీవితాన్ని ధారపోసిన త్యాగశీలి, మహిళా లోకాన్ని తట్టిలేపిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. సోమవారం హన్మకొండ రాంనగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్ అధ్యక్షతన సావిత్రిబాయిపూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాదె ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనతంరం ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలపై పోరాడిన సహృదయశీలి, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రిబాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. మహారాష్ట్రలో ఉపాధ్యాయ శిక్షణ పొంది, స్త్రీలు బాలికలు అంటరాని దళితకులాలు చదువుకోకూడదనే నియమ సాంప్రదాయాన్ని అధిగమించి ఎంతో సాహసంతో తన భర్త జ్యోతిరావు పూలతో కలిసి నిమ్న కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించిన మొదటి ఉపాధ్యాయురాలు అని అన్నారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మహిళా హక్కులపై రాజీలేని పోరాటాలు చేయాలని ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, రాగుల రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, జి.రాములు, కాడబోయిన లింగయ్య, నాయకులు ఓరుగంటి సాంబయ్య, మంద సంపత్, ఎం రమాదేవి, నోముల కిషోర్, మంద మల్లేశం, జంపాల రమేష్, యు.నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో...

సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కషి చేయాలని కేవీపీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ పిలుపునిచ్చారు. హనుమకొండ కెవిపిఎస్ జిల్లా కార్యాలయం రాంనగర్ ఆఫీసులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మంద సంపత్ పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్ అధ్యక్షత వహించగా మంద సంపత్ మాట్లాడారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా భర్త చనిపోతే భార్యని చితిలో వేయాలని సంస్కృతి, నిబంధనలకు వ్యతిరేకంగా వితంతు మళ్లీ వివాహం చేసుకోకూడదు అని మనుధర్మ శాస్త్ర భావజాలనికి వ్యతిరేకంగా ప్రభుత్వ పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. అనంతరం అఖిలభారత మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ తను విద్య బోధన పాఠశాలకు వెళుతున్న సందర్భంలో బ్రాహ్మణ పూజారులు కులం తక్కువ దానివి మహిళవి నీకెందుకు చదువు అని రాళ్లతో బురదజల్లే పరిస్థితులలో తను తీసుకుపోతున్న బ్యాగులో రెండు డ్రెస్సులు తీసుకొని పాఠశాలలో డ్రెస్ మార్చుకొని ఉన్నతమైన విద్యావంతురాలుగా ఈ భారతదేశానికి ఆదర్శవంతంగా మహిళలకు స్ఫూర్తినిచ్చేలా సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని ఆదర్శంగా తీసుకునే విధంగా మహిళ కోసం పని చేశారని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మంద మల్లేశం జిల్లా కమిటీ సభ్యులు రేణిగుంట్ల చందర్, దాసరి నరేష్, హరికృష్ణ, కెవిపిఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు గడమల్ల విజయ, సిరిమల సుభద్ర, మనోహర్, సిఐటియు నాయకులు ఆలకుంట మల్లయ్య చేరిపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : నేటి తరం యువత విద్యార్థులు సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోనీ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు జరిపారు. సందర్భంగా సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, సాయి కిరణ్, పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్,పట్టణ కార్యదర్శి కొగిల సాయి తేజ, లిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్స్ కరుణాకర్, నాగరాజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ కాలనీ : సావిత్రిబాయి పూలే వర్ధంతిని మడికొండలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సాంబయ్య సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. స్త్రీల అభ్యున్నతికై సావిత్రిబాయి పూలే ఆశయాల సాధన కోసం కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంటి రవి, రమేష్, జాన్ బి, నాగరాజు, సీతమ్మ కస్తూరి కొమరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని చరిత్ర కాంగ్రెస్‌ది

ఏడాది పాటు రజతోత్సవ వేడుకలు

ఈ నెల 27న లక్షల మందితో బీఆర్ఎస్ భారీ సభ

మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు

నవతెలంగాణ-నక్కలగుట్ట



హామీలు అమలు చేయని చరిత్ర కాంగ్రెస్ ది అనిమాజీ మంత్రి హరిష్‌రావు విమర్శించారు. సోమవారం హనుమకొండ హరిత హెూటల్ లో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతి పక్ష నేత మధుసూదన్ చారి,మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య,మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్,ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి,పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్,శంకర్ నాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ 25వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా రజితోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని తెలిపారు. గతంలో 15 లక్షల మంది తో మహా గర్జన నిర్వహించిన చరిత్ర ఉందన్నారు. ఉద్యమాల ఖిల్లా వరంగల్ లో అనేక భారీ బహిరంగ సభలు నిర్వహించామని గుర్తు చేశారు. ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించే సభకు రెండు చోట్ల చోట్లా స్థలాలను పరిశీలించడం జరిగిందని అన్నారు. ఏడాది పాటు రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటాన్ని, పదేండ్ల పరిపాలనను నిదర్శనంగా రజోత్సవ సభను ఘనంగా నిర్వహించాలని అన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ప్రారంభించిన రైతు బంధు పథకం పిఎం కిసాన్‌గా, మిషన్ భగీరథ పథకాన్ని హార్ఘర్‌జల్ అని, మిషన్ కాకతీయ లాంటి ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలతో ప్రగతిని అందించడం జరిగిందని అన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, రైతులకు సాగునీరు అందించడం ద్వారా దేశంలోనే అత్యధిక వరి ధాన్యాన్ని పండించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. జిడిపి పర్ క్యాపిటల్ ఇన్కంలో దేశానికి మార్గదర్శిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప, ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని అన్యానరు. రైతులకు రుణమాఫీ కాలేదని ఇచ్చిన హామీలు అమలు చేయని చరిత్ర కాంగ్రెస్‌దని అన్నారు. కానీ, బీఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు గుర్తు చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. గోదావరి, కష్ణ జలాలను ఆంధ్రకు తీసుకు పోతుంటే అధికారంలో ఉన్న,లేకపోయినా తెలంగాణ ప్రజల పక్షాన నిలబడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఖమ్మం నల్లగొండ,మహబూబ్ నగర్ లో పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్టు చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలే నరేందర్‌రెడ్డి ఓటమికి కారణమయ్యాయని అన్నారు. అమ్ముడుపోయే చరిత్ర రేవంత్ రెడ్డికే ఉందన్నారు. మొన్నటి ఎన్నికల్లో బడే బాయికి చోటే బాయ్ ఇచ్చిన గిఫ్ట్ గా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతుల పరిష్కారానికి చర్యలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

నవతెలంగాణ-సుబేదారి



ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 114 వినతులను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసిన వినతులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, గ్రామీణ అభివద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెలాఖరు వరకే 25శాతం రాయితీతో గడువు

-హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద

నవతెలంగాణ-నక్కలగుట్ట

ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో ఇరు జిల్లాల కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్ పై లేఅవుట్ డెవలపర్లు, సర్వేయర్లు, యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు.26 ఆగస్టు 2020కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్న ఎల్ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్దీకరించుకొనేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితితో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని అన్నారు. గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ల యజమాని ఫోన్‌కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. తిరస్కరణకు గురి అయితే చెల్లించిన డబ్బుల నుంచి 10శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించు కోడానికి అవకాశం ఉండదని తెలిపారు.భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్ఆర్ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు.అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవడంపై డెవలపర్లు, ప్లాట్ల యజమానులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్లు, కమిషనర్ నివతి చేశారు. ఈ సమావేశంలో కుడా పిఓ అజిత్‌రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్,జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులతో పాటు లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు డెవలపర్లు, టౌన్ ప్లానర్ లు, తదితరులు పాల్గొన్నారు.



24గంటలూ ప్రజలకు సేవలందిస్తాం

వరంగల్ నూతన సీపీ సన్‌ప్రీత్ సింగ్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

నిరంతరం ప్రజలకు సేవలదిస్తూ 24గంటలూ ప్రజలకు అందుబాటు లో వుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. రాష్ట్ర ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నకమిషనర్‌కు డిసిపిలు,అదనపు డిసిపిలు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసు గౌరవవందనం స్వీకరించారు. అనంతరం నూతన పోలీస్ కమిషనర్‌గా పూర్వ సిపి అంబర్ కిషోర్‌ఝా నుంచి బాధ్యతలు స్వీకరించారు. అంబర్ కిషోర్‌ఝా నూతన పోలీస్ కమిషనర్ పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వందశాతం శాంతిభద్రతలను కాపాడుతామని, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా ఇరువైనాలుగు గంటలు ప్రజల కోసం పని చేస్తామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు, ట్రాఫిక్ క్రమబద్దీకరణకై కృషి చేస్తామని, ప్రస్తుతం పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లసైబర్ క్రైం, మత్తు పదార్థాల కట్టడితో పాటు మత్తు పదార్థాల వినియోగించేవారు, విక్రయించేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని,రాబోవు రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులను మరింత బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సీపీని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసిన వారిలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీ చైతన్య అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్ తో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ చెందిన ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇతర విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

నేడు పరకాల డివిజన్ స్థాయి


ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకుల సమావేశం

నవతెలంగాణ -పరకాల

నేడు పరకాల డివిజన్ పరిధిలో పని చేసిన ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు దొగ్గెల తిరుపతి తెలిపారు. పూర్వం పరకాల డివిజన్ కేంద్రంగా పని చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, ఉదయం 11గంటలకు పరకాల పట్టణ కేంద్రంలోని రాజిపేటలో గల అంబేద్కర్ భవన్‌కు చేరుకుని సమావేశాన్ని విజయవంతం చేయాలని తిరుపతి పిలుపునిచ్చారు.

ఈనెల 17న వారాంతపు అంగడి వేలం

మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్



నవతెలంగాణ-భూపాలపల్లి

ఈనెల 17న భూపాలపల్లి వారాంతపు అంగడి, తైబజార్ గంప చిట్టి, జంగేడు, కాసింపల్లె వారంతపు అంగడికి వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఒకటి ఏప్రిల్ 2025 నుండి 31 మార్చి 2026 వార్షిక వేలం వేయడం జరుగుతుందన్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు కార్యాలయ నిబంధన ప్రకారం ధరావత్ డిడితో పాటు రూ.2500 రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే మొత్తం రూపాయలను చెల్లించి అగ్రిమెంట్ చేయించుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన టెండర్ ను రద్దుపరిచే అధికారం కౌన్సిల్ కు ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన



నవతెలంగాణ-మల్హర్‌రావు(కాటారం)

కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు కోసం ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం సబ్ కలెక్టర్ కార్యాలయం కొనసాగుతున్న వైటీసీ భవనం, తహసీల్దార్ కార్యాలయంతో పాటు మరో రెండు ప్రైవేట్ భవనాలు కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయా లేదా అని ఆరా తీశారు. భవనాల్లో సౌకర్యాలు, ప్రధాన కూడలికి దూరం అంచనా వేశారు. కోర్టు ఏర్పాటుకు అన్ని వసతులు కలిగిన భవనానికి సంబంధించిన వివరాలను ఉన్నత అధికారులకు ప్రతిపాదించనున్నట్లు కోర్టు అధికారులు తెలిపారు. ప్రధానన్యాయమూర్తి వెంట జూనియర్ జడ్జిలు రామ్మోహన్, నిఖిల, డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్, మంథని, భూపాలపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, సురేశ్,న్యాయవాదులు ఉన్నారు.

పరుశరాంపల్లి గ్రామాన్ని తరలించాలని ఓసీత్రీ ఎదుట ధర్నా

సింగరేణి జీఎం, చిట్యాల సీఐ హామీతో ధర్నా విరమణ



నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు సోమవారం ఓసీత్రీ ప్రధాన రహదారిపై బైఠాయించారు. రోడ్డుపై టెంట్ వేసి గ్రామస్తులందరూ ధర్నా చేశారు. పరశురాంపల్లి గ్రామాన్ని మొత్తం తరలించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలు మొత్తం తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడం వల్ల కూలి పనులు లేక పస్తులుంటున్నామని, గ్రామంలో తాగునీరు లేక అల్లాడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఓసీ-3లో 90 శాతం వ్యవసాయ భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు కూడా ఉపాధి కల్పించడంలో సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామంలో కేవలం ఇండ్లు మాత్రమే మిగిలాయని, ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు కూలీలకు వెలుతూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఓసిత్రీలో 2012లో భూములు కోల్పోయినప్పటి నుండి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు తీసుకునే సమయంలో మాయ మాటలు చెప్పి ఉద్యోగాలు. పునరావాస ప్యాకేజీ అందిస్తామని సింగరేణి అధికారులు చెపితేనే కన్నతల్లి లాంటి పంట భూములు ఇచ్చామన్నారు. అనంతరం సగం ఊరును సింగరేణి సంస్థ సర్వే చేసిందని సర్వే చేసిన వరకు ఇంటి స్థలాల భూములను ఇండ్లను తీసుకుంటామని చెప్పి ఇప్పటివరకు తీసుకోలేదు అన్నారు. సగం ఊరును ఇవ్వమని పరశరాం పల్లి గ్రామాన్ని మొత్తం తీసుకోవాలన్నారు. ఓసి త్రీ కి పరశురాంపల్లి దగ్గర ఉండడం వల్ల బాంబు బ్లాస్టింగ్‌లతో ఇంటి గోడలు బీటలు బారుతున్నాయని, ముసలి వాళ్ల గుండె పోటుకు గురవుతున్నారన్నారు. అంతేకాక దుమ్ము ధూళితో అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. బోర్లు వేస్తే ఎత్తిపోతున్నాయని నీళ్లకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భారీ వాహనాలు నడవడం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. దుమ్ము ధూళితో పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయని, పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకు పోయామన్నారు. గ్రామాన్ని తరలించే వరకు ధర్నాను విరమింప చేయమన్నారు.

నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం : సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి

పరుశురాంపల్లి గ్రామస్తులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి అడిషనల్ జీఎం కవింద్ర ధర్నా వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులతో చర్చించారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో వెళ్లిపోయారు. దీంతో భూ నిర్వాసితులు టెంటు వేసి భారీ ఎత్తున నిరసన తెలుపడంతో ఎస్సై రేఖ అశోక్, ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వడంతో చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ ధర్నా వద్దకు వచ్చారు. అప్పటికే సింగరేణి జిఎంను పిలిపించారు. గ్రామస్తులతో చర్చలు జరిపారు. నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింప చేశారు.

నేడు దత్తత గ్రామం కొండపర్తికి గవర్నర్ రాక

ఏర్పాట్లు పూర్తి : ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర



నవతెలంగాణ -తాడ్వాయి

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత గ్రామం ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి ఆదివాసి గ్రామానికి నేడు మంగళవారం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్, స్థానిక మంత్రి సీతక్క వస్తున్నారు. దీంతో కలెక్టర్ టిఎస్ దివాకర్ సోమవారం కొండపర్తి దత్తత గ్రామాన్ని సందర్శించి, గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలించారు. కొండపర్తి గ్రామంలో నిర్మించిన బహుళ ఉపయోగ భవనం, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డిఎస్పి రవీందర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు గవర్నర్ రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, ముందస్తు ప్రణాళికతో పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. గవర్నర్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మేడారం వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో వెంకటేష్, తాడ్వాయి డిప్యూటీ తాసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో సుమన వాణి, ఎంపీఓ శ్రీధర్‌రావు, ఐటిడిఏ ఏఈ రాము, స్థానికులు, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్, ఇరుప సునీల్, వివిధ శాఖల అధికారులు, ములుగు- తాడ్వాయి మండలాల ఎంపీడీవోలు, తాసిల్దార్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి : జిల్లా కలెక్టర్





నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన జిల్లాలో ఉన్న సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ గవర్నర్ దత్తత తీసుకున్న తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామానికి వస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. అనంతరం మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుంటారని అన్నారు. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని విజయవంతం చేయాలని ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, అతిథి గృహంలోని గదులను శుభ్రంచేయాలని, శానిటేషన్ చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ములుగు, తాడ్వాయి మండలంల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

• **జిల్లా ఆదనపు కలక్టర్ అశోక్ కుమార్**



నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అదనపు కలెక్టర్ స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా పనిచేయాలి

• **భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే**



నవతెలంగాణ-భూపాలపల్లి

పోలిస్ వ్యవస్థను ప్రజలు గౌరవించేలా సమర్ధవంతంగా పని చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలిస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 మంది ఫిర్యాదుదారుల పిటిషన్‌లను స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహభావంతో మెలుగుతూ వారి పిర్యాదులను స్వీకరించి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, సంఘవ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పోలీసులకు తెలుపాలని ఎస్పీ సూచించారు.

సేవలకు అవార్డుతో సత్కారం



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఆక్స్‌ఫర్డ్ పాఠశాల చైర్మన్ సంగీత కరణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తు న్న 30మంది మహిళామణులను రాణి రుద్రమదేవి జాతీయ అవార్డును ప్రకటించారు. ఇందులో భాగంగా భూపాలపల్లి జిల్లా నుంచి ఏకైకంగా ఆక్స్‌ఫర్డ్ పాఠశాల చైర్మన్ సంగీత-కరణ్ రాణి రుద్రమదేవి అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం వరంగల్ నగరంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల దేవి చేతుల మీదుగా సంగీత కరణ్ అవార్డు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. 2013లో పాఠశాలను స్థాపించి భూపాలపల్లి పరిసర ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అందిస్తున్నారు. క్రీడారంగంలో సైతం విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో మానసికోల్లాసాన్ని నింపుతున్నందుకుగాను అవార్డు అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అవార్డు అందుకోవడం పట్ల వివిధ పాఠశాలల చైర్మన్లు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేయగా పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్, డైరెక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు కలిసి సంగీత కరణ్‌ను ఘనంగా సత్కరించారు.

సీఎం, ఐటీ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని అన్ని గ్రామ దళిత వాడలో రోడ్లకు నిధులు, అగ్నిమాపక కేంద్రంతోపాటు ఉద్యోగులను కూడా కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి, ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో ఎస్సి సెల్ మండల అధ్యక్షులు లేతకారి రాజబాబు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంథని నియోజకవర్గం వ్యాప్తంగా దళిత వార్డుల్లో రోడ్లకు రూ.10కోట్లు మంజూరు చేశారని, మహాదేవపూర్ మండలానికి రూ.కోటి5లక్షల 50 వేలు మంజూరు చేపించారన్నారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో అగ్నిమపాక కేంద్రాన్ని, ఉద్యోగాలను మంజూరు చేపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్, బ్లాక్ అధ్య క్షులు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ రాణిభాయ్ రామారావు, మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణశ్రీనివాస్, మాజీ ఎం పీటీసీ సుధాకర్, బ్లాక్ మైనార్టీ అధ్యక్షులు ఆశ్రర్, యూత్ టౌన్ అధ్యక్షులు నాయిమ్, కాళేశ్వరం దేవస్థానం మాజీ చెర్మన్ వామన్‌రావు, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు లింగాల సుందర్, సీనియర్ నాయకులు వెన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాల్వ గంగయ్య,ధర్మయ్య,రమేష్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

• **ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఎల్ రవి**

నవతెలంగాణ - ములుగు

తెలంగాణ రాష్ట్రంలోనే విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ శాఖ మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ రవి మాట్లాడుతూ రాష్ట్రం లోనే ప్రభుత్వ విద్యారంగ సమస్యలతో సతమతలాడుతున్నదన్నారు. ప్రధానంగా సంక్షేమ వస తి గృహాలు, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల గాక పేద మధ్య తరగతి విద్యార్థులు చదువులు మధ్యలోని ఆగిపోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దీకొండ భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోకిల బాలు, నాయకులు దుర్గం యుగెందర్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జ్యోతిరావు పూలే 128 వర్ధంతి

నవతెలంగాణ- ములుగు

ములుగు పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింత నిప్పుల బిక్షపతి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతనిప్పుల బిక్షపతి మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పూలే ఎంతోమంది మహిళలను చైతన్యవంతం చేసిందన్నారు. సామాజిక కార్యకర్తగా సంఘ సేవకురాలుగా అనేక కార్యక్రమాలు మహిళల కోసం నిర్వహించిందని, ఆమె పాత్ర ఎనలేనిది అన్నారు. సమాజంలోని మూఢనమ్మకాల పై అర్థం లేని ఆచారాలపైన, అసమానతులపైన ఆమె పోరాటం చేసిన ధీశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జన్ను రవి, పౌడాల ఓం ప్రకాష్, ఎండి అహ్మద్ పాషా, ఓరుగంటి అనిల్, గందె రాజు, గందె మధు, గాజే రాజు, మాదారపు రాజు, షర్ఫోద్దిన్ నరేష్, పైడిమల్ల భరతుడు తదితరులు పాల్గొన్నారు.



సురేఖ అకాల మరణం బాధాకరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు

నవ తెలంగాణ-గోవిందరావుపేట

ఏఎన్ఎం సురేఖ అకాల మరణం అత్యంత బాధాకరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. మండలంలోని పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాజెక్టునగర్ ఉప కేంద్రంలో యూరోపియన్ కమిషన్ ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న సురేఖ అకాల మరణం పొందిన విషయం విధితమే. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి రూ.71,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక చేయూతకు సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రత్యేక చొరవను చాటిన వైద్యం ఉద్యోగుల సంఘం ఐఎన్టిఈసి 31 94 జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి, కోశాధికారి వినోదర్‌ను అభినందించారు. కోవిడ్ సమయంలో విశేష సేవలందించడమే కాకుండా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో ముందంజలో నిలిచిందని, ఆమె సేవలు మరువలేవని డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రణధీర్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మధు, డెమో సంపత్, కార్యాలయ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, డీపీహెచ్ఎం శకుంతల, సీనియర్ అసిస్టెంట్ గణేష్, పస్రా పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో అలిమ్కో - సమగ్ర శిక్ష వారి సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ గుల్ల పెళ్లి సాంబయ్య హాజరై మాట్లాడుతూ ఇచ్చిన వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, చెవిటి మిషన్లు, రోలాటర్, టీఎల్ఎం కిట్లు మొదలైన పరికరాలను సక్రమంగా వినియోగించుకునేలా తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎటువంటి సందేహాలున్నా మండల పరిధి ఐఈఆర్పిలను సంప్రదించాలన్నారు. ప్రతి సంవత్సరం ఎస్-ఎస్ ద్వారా భవిత పాఠశాలలోకి వచ్చే దివ్యాంగులకు రవాణా భత్యం, సాధారణ పాఠశాలలో విద్య అభ్యసించే దివ్యాంగ పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్, దివ్యాంగ విద్యార్థినులకు స్కాలర్షిప్ అందిస్తారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి భవిత సెంటర్‌లలో జరిగే ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ క్యాంపులను వినియోగించుకోవాలన్నారు. అర్హతలను నిర్ధారించుటకు ప్రతి సంవత్సరం జరిగే మెడికల్ అసెస్మెంట్ క్యాంపులకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం ములుగు మండల విద్యాశాఖాధికారి సామల శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్స్ అర్షం రాజు,ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ములుగు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు, అలింక్కో ప్రతినిధి ప్రీతిగ, ఆడియాలజిస్ట్ రతన్ సింగ్, ఐఈఆర్పి లు, దివ్యాగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమా మసీదును ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన జమా మసీదును మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మసీదు నిర్మాణం కోసం రెండు గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన మహమ్మద్ అక్బర్, నిర్మాణానికి ముందుకు వచ్చిన ప్రధాన దాత ఎండీ రియాజుద్దీన్, సోదరీమణి ఆయేషా సేవలు, చేసిన కృషి అభినందనీయం అన్నారు. మసీదు నిర్మాణం వరకు సీసీ రోడ్డు మరియు కబ్రిస్తాన్ నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, నాగేందర్, నాయకులు, ముస్లిం సోదరులు ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలి

• **బీఆర్ఎస్ జిల్లా నాయకులు**

పోరిక గోవింద్‌నాయక్



నవతెలంగాణ - ములుగు

పంట పొలాలకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోరిక గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ములుగు మండలంలోని సర్వాపూర్ రాయనిగూడెం, కొత్తూరు, పంచోత్కులపల్లి గ్రామాల్లో ఉన్న రైతులు వ్యవసాయానికి నీరు లేక ఎండిపోతున్న వరి పంటలను సోమవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు పండించే పంటలకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీటిని అందించాలన్నారు. పంటలు ఎండిపోక ముందే రైతులకు నీరు అందించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. కాల్వల్లో సిల్ట్ తీసి నీందించాలని అన్నారు. ఇప్ప టికే పంట దిగుబడి, మద్దతు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, మాజీ ఎంపీటీసీ ఆవుల లక్ష్మి నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు అప్పాజీ ఐలయ్య, బిక్షపతి, బత్తుల సాగర్ సల్లూరి గణేష్, జాడి శ్రీనివాస్, గట్టు నారాయణ, పల్లె మధుకర్, దయ్యం నవీన్, సంతోష్, సాయి రైతులు పాల్గొన్నారు.

బడిలో నీటి కష్టాలు.. తాగునీటికి విద్యార్థుల అవస్థలు



నవతెలంగాణ -తాడ్వాయి

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తామని, ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేశారే తప్ప క్షేత్రస్థాయిలో అమలు కావట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు కనీసం నీటి కష్టాలు తీరడం లేదు. ఇందుకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయతీ పరిధి ఒడ్డుగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిదర్శనం. రెండు ఒకే వద్దనే ఉండగా పాఠశాలలకు గత 15, 20 రోజుల నుండి నీటి కష్టాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం భోజనం తయారు చేయడానికి, భోజనం చేసిన తర్వాత ప్లేట్లు కడుక్కోవడానికి పాఠశాల ఆవరణలో ఉన్న రెండు చేతి పంపులు చెడిపోయాయి. పంచాయతీ కార్యదర్శికి విషయం చెబితే పట్టించుకోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సరిగా రావడం లేదని, మూడు నాలుగు రోజులకు ఒకసారి వస్తుందని వాపోయారు. వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచుతున్నాయని, మునుముందు తాగునీటి అవసరం మరింత పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు ఇంగ్లీషులో మెలకువలు నేర్చుకోవాలి

• **సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి అర్షం రాజు**



నవతెలంగాణ- ములుగు

ఉపాధ్యాయులు ఇంగ్లీషులో మెలకువలు నేర్చుకోవాలని సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి అర్షం రాజు తెలిపారు. ఒకటి నుంచి ఐదవ తరగతి చదివే విద్యార్థులు ఇంగ్లీషులో భాషలో మాట్లాడుటకు, ఇంగ్లీష్‌లో మెలకువలను నేర్పించుటకు గాను దిశా ఫౌండేషన్ సహకారంతో జిల్లా విద్యాశాఖాధికారి పాణిని ఆధ్వర్యంలో సోమవారం మోడల్ స్కూల్ జవహర్ నగర్‌లో మండలానికి ఆరు చొప్పున 54 పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అర్షం రాజు హాజరై మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దిశ ఫౌండేషన్ మెటీరియల్ సహకారంతో వీడియో లెస్సన్స్ ద్వారా బోధన చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలకు వీడియో పాఠాల మెమరీ కార్డ్, వర్క్ బుక్‌లు, ఫ్లాష్ కార్డులు, ఇతర బోధనోపకరణాలు అందజేస్తామన్నారు. మొదటి దశలో 54 పాఠశాలలు ఎన్నుకొని ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దిశా ఫౌండేషన్ ప్రతినిధులు ఐశ్వర్య ప్రతిభ, ముబీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుడికి మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ టేకుమట్ల

టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(వి) గ్రామానికి చెందిన ఏంబాడీ నాగరాజు వారం రోజుల క్రింద మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సుధాకర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకొన్నారు. రూ.17వేల విలువగల మొబైల్ ఫోను బాధితుడు నాగరాజుకి సోమవారం అప్పగించారు. అనంతరం బాధితుడు నాగరాజు స్టేషన్ సిబ్బందికి, ఎస్సై సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే మీ సేవాలో దరఖాస్తు చేసి, అనంతరం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఝాన్సీరెడ్డి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల



మండలంలోని మైదాన్ చెరువు తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకోండగా పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి సోమవారం ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అధైర్య పడొద్దని వైద్యుల సూచనలు మేరకు ఆరోగ్య నియమాలు పాటించడం వల్ల ఇంతటి రోగాన్ని అయినా నయం చేసుకోవచ్చని సూచన చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేష్‌నాయక్, పాలకుర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు రాణించాలి

● నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీరెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి



చదువుల తల్లి సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ మహిళా హక్కుల సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహానేత సావిత్రిబాయి పూలే అనే కొనియాడారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, తాజా మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, జిల్లాకు ఆప్షన్ మాజీ సభ్యులు ఎండీ మదర్, మారం శ్రీనివాస్, నీరటి చంద్రయ్య, ఐలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

● కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 80 శాతం వరకు మహిళలే జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో వారి కృషి ఎంతో ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. అలాగే ఆర్‌బీఎస్‌కేల ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్లజోళ్లను అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే ఐడీఓసీని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బందిని, మున్సిపల్ మహిళా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. అదే విధంగా వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులను, ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాధురీ కిరణ్ చంద్ర షా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఫ్లోరెన్స్, డీపీవో స్వరూప, డీఆర్‌డీఏ వసంత, డిప్యూటీ జెడ్పీ సీఈవో సరిత, డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు, జౌళి శాఖ అధికారిణి చౌడేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, టీజీవోస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, టీఎన్జీవోస్ ప్రెసిడెంట్ ఖాజా షరీఫ్, సీడీపీవో రమాదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ హెచ్.శారద, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పై అవగాహన కల్పించాలి

● అధికారులకు సమయపాలన తప్పనిసరి

● కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి అనంతరం సోమవారం జిల్లా అధికారులందరితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి, మార్చ్ 31 వరకే రాయితీ వర్తిస్తుందని, ప్రతి దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి రాయితీని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు నీటి వనరులపై క్షుణ్ణంగా సమీక్షించి, నీటి వనరుల మరమ్మతులు పూర్తిచేయాలని, అలాగే తాగునీటి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. 12 మండలాల్లోని ఎంపిక చేసిన మోడల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని, వీటి నిర్మాణంపై మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ ఆర్డీవో గోపీరాం, డీఆర్‌డీఓ వసంత, సీపీఓ పాపయ్య, డీపీవో స్వరూప, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఏఓ రామారావు నాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీరెడ్డి పరామర్శ..

నవతెలంగాణ-పాలకుర్తి



మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జలగం కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవడంతో పాటు తీగారం గ్రామానికి చెందిన పోగు గోపమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. జలగం కుమార్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గోపమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తీగారం మాజీ సర్పంచ్ పోగు శ్రీనివాస్, రాజేశ్వరిలను పరామర్శించారు. ఈసందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ గోపమ్మ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తియాదవ్, తాజా మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, మాజీ ఉపసర్పంచ్ మారం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొలుగూరి యాకయ్యగౌడ్, బైకానీ ఐలేష్‌యాదవ్, సలేంద్ర శ్రీనివాస్‌యాదవ్, ఎండీ.సలీంలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటలకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలి









● పంటలను పరిశీలించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-జనగామ

నీళ్లు అందక ఎండిన వరి పంటలకు ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జనగామ మండలంలోని వడ్లకొండ గానుగుపాడు గ్రామాలలో ఎండిన వరి పంట పొలాలను జాన్ వెస్లీ పర్యటించి పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తమ బాధలను జాన్ వెస్లీతో పంచుకున్నారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జాన్ వెస్లీ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి ముందు చూపు లేకపోవడం వలన పంట పొలాలు ఎండిపోయాయన్నారు. దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో నింపకపోవడం వలన గ్రామాలలో చెరువులు, కుంటలు నింపకపోవడం, బోర్లు బావులు అడగంటి పోయి రైతులు వేసిన వరి పంటలు మొత్తం ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు ఎకరాకి రూ.30నుండి 40వేలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని, ఎండిన పంట పొలాల ప్రతి రైతుకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకి ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పోత్కానూరి ఉపేందర్, బూడిద గోపి, సుంచు విజేందర్, జోగు ప్రకాష్, దడిగే సందీప్, నాయకులు బండిరాజుల శ్రీరాములు, కన్నెబోయిన బాలరాజు, బోడ రాములు, దండెబోయిన సికిందర్, మద్దోజు రామసోఖం, కాస జగన్, కూరాకుల శ్రీను, బాల్నే కిష్టయ్య, గుండెల్లీ రాజు, దాడిగే రాజు, గటయ్య, దండు శ్రీను, కూరాకుల సమ్మయ్య, బొట్టు శివ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ముందు చూపు లేకపోవడం వలన చేతికొచ్చిన వరి పంటలు ఇప్పటికే 40 శాతం పంట పొలాలు ఎండిపోయాయని ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేలు రూపాయల నష్టపరిహారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 16వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు ముందే జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలను నింపి రైతుల పంట పొలాలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలో ఎండిపోయిన వరి పంటల పరిశీలన సందర్భంగా పర్యటనకు బచ్చన్నపేటకు వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, బాణ సంచాలు కాల్చి పువ్వులు చల్లి పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ ద్వారా బచ్చన్నపేట మండలం చిన్న రామచర్ల గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను సీపీఐ(ఎం) పార్టీ బృందం సందర్శించి పరిశీలించారు. అనంతరం పత్రిక విలేకరులతో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని వాగ్దానం ఇచ్చి 2 సంవత్సరాలు అవుతున్నా నేటికి హామీ నెరవేర్చాలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటన లోపే ఎండిన పంటలను ప్రభుత్వ అధికారులు ఎనమరేషన్ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులు కుంటలు నింపి మిగిలిన వరి పంటలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో సీపీఐ(పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు , ఇర్రి అహల్య జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, మండల ఇన్‌ఛార్జ్ సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, మండల కమిటీ సభ్యులు రావుల రవీందర్‌రెడ్డి, మిన్నలాపురం ఎల్లయ్య, అన్నబోయిన రాజు, బైరగొని బలరాములు, పర్వతం నరసింహులు, తాడెం రాములు, ఇంజ ఎల్లయ్య, మన్నే లక్ష్మి కల్పన, రామగళ్ళ అశోక్, గ్రామ శాఖ కార్యదర్శి సుధాకర్, బాల నర్సయ్య కనకయ్య అన్నబోయిన శ్రీనివాస్, నాగరాజు, నరసింహస్వామి, మల్లేశం, గంగరబోయిన, సమ్మయ్య మానేపల్లి నిర్మల, గంగరబోయిన బుచ్చమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్

ఉప్పుగల్లు రిజర్వాయర్ నుండి పాలకుర్తి రిజర్వాయర్ వరకు వెళ్లే వరద కాలువను త్వరితగతిన పూర్తిచేసి రైతుల పంట పొలాలకు నీరందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మండలంలోని తిమ్మంపేట గ్రామ శివారులోని వరద కాలువను, టీబీ తండ గ్రామంలోని రైతు దస్రు ఎండిన పంట పొలాలను, బోరుబావులను, మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామంలో ఎండిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 16న జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, జఫర్‌గడ్ మండలంలో వరద కాలాలను ఎప్పుడు పూర్తి చేసి, రైతు పంట పొలాలకు నీరు అందిస్తారా సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం వెంటనే పంట పొలాలను పరిశీలించి ఎండిన ప్రతి పంట పొలానికి ఎకరం చొప్పున రూ.50,000 నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, సింగపురం రమేష్, బొట్ల శేఖర్, అహల్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండె బోయిన రాజు, మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నల్ల తీగల శ్రీను, యాతం సమ్మయ్య, సీపీఐ(ఎం) నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకుర్తి

పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంలో గత, నేటి పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. సీపీఐ(ఎం) బృందం పర్యటనలో భాగంగా సోమవారం పాలకుర్తి రిజర్వాయర్ పనులను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డిలతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోవడం వల్లనే రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ పేరుతో పాలకుర్తి చెరువు కట్టను తొలగించడంతో నాలుగు సంవత్సరాలుగా 400 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేసుకోవడం లేదని, దీంతో ఆర్థికంగా రైతులు నష్టపోయారని తెలిపారు. రూ.66 కోట్ల నిధులతో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను ప్రారంభించిన గత పాలకులు కేవలం రూ.18 కోట్లు మాత్రమే పాలకుర్తి రిజర్వాయర్‌కు ఖర్చు చేశారని తెలిపారు. రిజర్వాయర్ పనులకు నిధులు సరిపోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణ పనులకు రూ.100 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదికను సమర్పించిందని తెలిపారు. అదనంగా నిధులు మంజూరు కాలేదని, రిజర్వాయర్ పనులు ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాలకుర్తి రిజర్వాయర్ పనులు పూర్తయితే 7500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా నిర్దిష్టమైన ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న రైతుల పంటలను కాపాడాలని, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి లతోపాటు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఐలమ్మ మనవడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం కుటుంబ సభ్యులు చిట్యాల సంపత్, చిట్యాల శ్వేతలను పరామర్శించారు. రామచంద్రం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాలకుర్తి అభివృద్ధిలో రామచంద్రం సేవలు మరువలేనివన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్మారక భవనాన్ని సందర్శించి పరిశీలించారు. రాజీవ్ చౌరస్తాలో గల చిట్యాల (చాకలి) ఐలమ్మ కాంస్య విగ్రహానికి జాన్ వెస్లీ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సింగారపు రమేష్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజయేందర్, చిట్యాల సోమన్న, ఎండీ.షబానా, జోగు ప్రకాష్, గుండెబోయిన నాగరాజు, మండల నాయకులు సోమసత్యం, సోమ అశోక్ బాబు, రాపర్తి మంజుల, ఏదునూరి మదర్, ముస్కు ఇంద్రారెడ్డి, అంజమ్మ, బెల్లి సంపత్, చెరిపెల్లి కొమరయ్య, నక్క రవి, నాయిని శ్రీను, మచ్చు పహాడ్ సోమయ్యలతో పాటు కార్యకర్తలు. నాయకులు పాల్గొన్నారు.

దేవరుప్పుల

జిల్లాలో సాగునీరు అందించడంలో విఫలమై 40 శాతం వరి పంటలు ఎండిపోయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం జిల్లాలో పర్యటించిన ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక లేకుండా రైతులకు అవగాహన కల్పించకుండా ప్రతి రైతు పెట్టుబడిని నష్టపోయారన్నారు. .ఈ సందర్భంగా జిల్లాలో ఈనెల 13వ తేదీన రైతుల పక్షాన ధర్నా నిర్వహించనున్నామని, నష్ట పోయిన ప్రతి ఎకరాకు రూ.యాభై వేలు రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈనెల16న ముఖ్యమంత్రి జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌కు రాకముందే ప్రతి రైతుకు న్యాయం చేయాలని కోరారు. నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై మండల కేంద్రంకు వచ్చిన జాన్ వెస్లీని గ్రామపంచాయతీ, జిల్లా సీఐటీయూ అధ్యక్షులు బత్తిని వెంకన్నలు పూల మాల వేసి శాలువాతో సన్మానించారు. వారి డిమాండ్‌ల వినతి పత్రంను అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మహ్మద్ జహంగీర్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, రాయపర్తి రాజు, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్ జిల్లా కమిటి సభ్యులు చుంచు యుగేంధర్, జోగు ప్రకాష్ గ్రామపంచాయతీ కార్మికులు ఈదునూరి వెంకట్ రెడ్డి,అయిలయ్య తదితరులు పాల్గొన్నారు .

ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు: కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్ వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా 73 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా అర్జీలు పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించి, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈప్రజావాణిలో జనగామ, ఘనపూర్‌స్టేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ ఆర్డీవో గోపీరాం, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఎవో రామారావు నాయక్, సీపీవో పాపయ్య, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిల్పూర్ మండల ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



కొత్తగా ఏర్పడిన చిల్పూర్ మండలం ప్రజా సౌలభ్యమైన పాలనకు ప్రజలు నోచుకోవడం లేదని సీపీఐ(ఎం) పార్టీగా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ చొరవ చూపాలని పార్టీ చిల్పూర్ మండల కమిటీ తరపున సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే విజయడైరీ పాడిరైతులకు సకాలంలో బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాడిరైతుల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కార దిశగా చొరవ చూపాలని విన్నవించారు. అనంతరం మండలంలోని క్రిష్టాజి గూడెం గ్రామానికి చెందిన ఊరడి బుచ్చిరాజ్‌ను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మండలంలో అనేక మంది పేదలకు ఇండ్లు-ఇండ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళ పెన్షన్లు అందక, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. మండలం సమగ్రాభివృద్ధి పట్ల పాలకులు శ్రద్ధపెట్టడం లేదని విన్నవించారు. కొత్తగా మండలం ఏర్పడినప్పటికీ ప్రజాపాలన సౌలభ్యం కోసం సొంత భవనాలను నిర్మాణం చేయలేదన్నారు. ఈప్రాంతంలో చుట్టుతా రిజర్వాయర్లున్నప్పటికీ రైతుల పంటభూములకు సాగునీరు మాత్రం అందడం లేదన్నారు. మల్లన్నగండి ఎడమ కాలువతో సాగునీరు అందించాలని, మండలంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు, వరద కాలువ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి సాగునీరు అందించాలని వివరించారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి సాదం రమేష్, కమిటీసభ్యులు పోలు సంపత్, ఆవుల ప్రభాకర్, కర్రె నాగరాజు, సాదం పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో హోలీ సంబరాలు జరుపుకోవాలి

● ఎస్సై రాజు

నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్సై చింత రాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల పైన వెళ్లే వాహనాలను ఆపి డబ్బులు అడగరాదని మహిళలైనా పురుషులైనా వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేయరాదని, వ్యాపారస్తుల నుండి డబ్బులు వసూలు చేయరాదని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సామరస్యంగా సంబరాలు జరుపుకోవాలని సూచించారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరు: మంత్రి ఉత్తమ్

● నీటి సరఫరాకు ఇబ్బందులుడ్డద్దు: మంత్రి తుమ్మల

● వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన నీటిపా రుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలు సోమవారం హైదరాబాదు సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ పి.గోపి, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య మాధ్యమం) ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి చేతన్ నితిన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ దశ్య మాధ్యమ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖామంత్రి మాట్లాడుతూ నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటలకు సాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖామంత్రి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు కింద అత్యధికంగా వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్‌లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-పాలకుర్తి



మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాయాల సోమయ్య ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడవల్లి సోంమల్లయ్య, ఎడవెల్లి సునీల్ మహాజన్‌లు మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోంమల్లయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తితో పేద ప్రజలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. పేదలకు అండగా నిలిచినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ళ ఆనంద్, కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడవెల్లి వెంకటేశ్వర్లు, ఎడవెల్లి సుభాష్, డాక్టర్ గద్దల యాకసోమయ్య, గూడూరు లెనిన్, ఎండీ సలీం, పన్నీరు వెంకన్న మామిండ్ల సోమయ్య, జీడి సోమయ్య, కొంగరి రాములు, సలేంద్ర సంపత్ యాదవ్, గాదెపాక రాంచందర్, గాయల ఎల్లయ్య రెహమాన్, ఎడవెల్లి ఐలయ్య, గడపురం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మహబూబాబాద్
మంగళవారం | మార్చి 11, 2025 | www.navatelangana.com

సావిత్రిబాయి పూలే వర్ధంతి



నవతెలంగాణ-బయ్యారం:
జీవితాల్లో వెలుగులు నింపి అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని బోధించి జ్ఞాన జ్యోతులను వెలిగించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం స్థానిక సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేవీపీఎస్ మండల కన్వీనర్ నిడికొండ చంటి అధ్యక్షతన జరిగిన ఈసభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు మండ రాజన్న పాల్గొని ప్రసంగించారు. మహిళలకు చదువులు నేర్పిన మహనీయురాలు, బహుజన జీవితాల్లో వెలుతురు నింపిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో అంగిరేకుల నాగేశ్వరావు, సిరిగిరి శ్యాంసుందర్, ఎన్.మోహన్, పతంగి పురుషోత్తం, డి.పెంటయ్య, పి.రాము, ఆర్.అప్పయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో.. సావిత్రిబాయి పూలే వర్ధంతి



నవతెలంగాణ-మహబూబాబాద్
మహబూబాబాద్ కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్య కంటి దావఖానలో సోమవారం డాక్టర్ లావూరి స్వాతి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేలా రామ్మూర్తి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సంఘసంస్కర్త, ఉపాధ్యాయుని, రచయిత్రి నిమ్న వర్గాలకే కాకుండా అన్ని వర్గాల మహిళలకు విద్య ఎంతో ముఖ్యమైనదని, ఇల్లాలి చదువు ఇంటికి దీపంగా వెలుగునిస్తుందని తన భర్త మహాత్మ జ్యోతిబా పూలే దగ్గర ప్రాథమిక విద్య నేర్చుకొని ఆహ్మదనగర్, పూనే మహారాష్ట్రలో ఉపాధ్యాయ శిక్షణ పొంది, స్త్రీలు బాలికలు అంటరాని దళిత కులాలు చదువుకోకూడదనే నియమ సాంప్రదాయాన్ని అధిగమించి ఎంతో సాహసంతో 1848లో తన భర్త జ్యోతిరావు పూలెతో కలిసి నిమ్న కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్ర సేవా ట్రస్ట్ అధ్యక్షులు అడ్డిచెర్ల మాధవరావు కేవీపీఎస్ జిల్లా నాయకులు మచ్చ వెంకన్న, చేపూరి గణేష్, నాగేల్లి సురేష్, ఖాదర్ బాబా, నందిని, అఖిల, వెన్నెల, మల్లిక, ధనసరి సారమ్మ, కమిలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



● కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మచారిలతో కలసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల వారితో సమన్వయ పరుస్తూ దరఖాస్తుదారులకు దిశా, నిర్దేశం చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈప్రజావాణిలో మొత్తం84 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డీసీవో వెంకటేశ్వర్లు, సీపీవో సుబ్బారావు, డీఈవో ఏ.రవీందర్‌రెడ్డి, ఎడీ సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, డీడీ సురేష్ గ్రౌండ్ వాటర్, డీపీవో హరి ప్రసాద్, డీఎం కృష్ణవేణి, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, డీడీట్రైబల్ వెల్ఫేర్ దేశిరామ్ నాయక్, జీఎం ఇండస్ట్రీస్ సత్యనారాయణ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు పెద్దన్నగా రేవంతన్న



● ఎమ్మెల్యే కోరం కనకయ్య
● లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-గార్ల:
పేదింటి ఆడపడుచులకు వివాహాలలో చేయూతగా నిలుస్తూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆడపడుచులకు పెద్దన్నగా సీఎం రేవంతన్న నిలుస్తున్నారని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. స్థానిక రైతు వేదికలో ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 26 మంది లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ఆపథకాలను అర్హులైన వారందరికీ అందే విధంగా కృషి చేస్తుందని చెప్పారు. చెక్కులు అందజేసిన వారిలో తహసిల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో మంగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సంజీవరావు, ఎవో కె.రామారావు, సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు, జిల్లా నాయకులు గుండా వెంకట్ రెడ్డి, బి.నాగేశ్వరరావు, బి. హతీరాం, నాయకులు, కార్య కర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బయ్యారం చెరువుకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందేనా..?

● అభివృద్ధికి నోచుకోని పెద్ద చెరువు
● బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉట్టి మాటలేనా
● వర్షాధార నీటితో నిండుతున్న చెరువు





నవతెలంగాణ-బయ్యారం:
తరాలు మారినా తలరాత మారని చందంగా బయ్యారం పెద్ద చెరువు ఏ అభివృద్ధికి నోచుకోకుండా నిస్సహాయ స్థితిలో శిథిలమైపోతుంది. సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తామన్న మాటలు ఉట్టి మాటలే అయ్యాయి. 12వ శతాబ్దంలో కాకతీయులచే నిర్మించబడిన బయ్యారం పెద్ద చెరువు బయ్యారం, గార్ల మండలాల ఆకలి తీర్చే అన్నపూర్ణగా పేరుగాంచింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్న పెద్ద చెరువుపై ప్రభుత్వాలకు ఎప్పుడూ చిన్నచూపే. ప్రభుత్వాలు ఎన్ని మారినా, పథకాలు ఎన్ని పెట్టినా బయ్యారం చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. బయ్యారం చెరువు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు జాబితాలో చేరిందని, ఇక చెరువుకు నిధుల వరద వస్తుందని మురిపించి మూడు దశాబ్దాలు కావస్తున్నా చెరువు అభివృద్ధికి నేటికీ నయాపైసా కేటాయించిన నాధుడే లేడు. 1997లో ఈచెరువు మీడియం ఇరిగేషన్‌లోకి మారిందని ఇరిగేషన్ అధికారులు ప్రకటించగా, మీడియం జాబితాలో బయ్యారం చెరువు లేదని 2004లో ఆనాటి జిల్లా కలెక్టర్ ప్రకటించాడు, అటు ఇటు కాకుండా మిగిలిపోయిన బయ్యారం చెరువు ఇటు మైనర్ ఇరిగేషన్‌కు వచ్చే మిషన్ కాకతీయ నిధులకు, అటు మీడియం ఇరిగేషన్ అయితే వచ్చే ప్రభుత్వ నిధులకు నోచుకోకుండా పాలకుల నిరాధరణకు గురైంది. ఒక్కసారి నిండితే రెండు పంటలు పండే స్థితి నుండి ఇప్పుడు రెండు సార్లు నిండినా ఒక్క పంటకు గ్యారెంటీ లేని స్థితికి చేరుకొంది. కాలువలు పూర్తిగా శిథిలమై చెరువులో నీరు పంట చేలకు అందకుండా వృధాగా ఏటి పాలైపోతున్నది. రైతుల పన్నుల ద్వారా జమ అవుతున్న ఓఅండ్ఎం నిధులను కూడా కాలువల తాత్కాలిక మరమ్మతులకు ఉపయోగించకుండా తీరా నాట్లు మొదలైన దాకా చూసి ప్రజా ప్రతినిధులు తన బినామీల ద్వారా తూతూమంత్రంగా నిండా నీళ్ళున్న కాలువలలో జేసీబీతో పనులు ఊడిపించి ఆ డబ్బులను కాజేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక బంగారు తెలంగాణలో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల ద్వారా ఇల్లందు నియోజక వర్గం సస్యశ్యామలమవుతుందని, బయ్యారం చెరువు గోదావరి నీటితో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారి వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలు తీరుస్తుందని ఊరించినవన్ని ఉట్టి మాటలే అయ్యాయి. రోళ్ళపాడు చెరువులో గత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి పది సంవత్సరాలు గడచినా నేటికీ నియోజక వర్గంలో ఒక్క ఎకరానికి నీళ్ళిచ్చిన పాపాన పోలేదు. పైగా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన రోళ్ళపాడు చెరువుతో సహా బయ్యారం చెరువును, గార్ల, బయ్యారం మండలాలను డిజైన్ నుండి తొలగించి సుదూర మెట్ట ప్రాంతానికి నీళ్ల తీసుకెళ్ళే విధంగా గత ప్రభుత్వ పాలనలో డిజైన్ మార్చి పనులు చేసుకుపోతున్నా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు నోరు మెదపలేదు. వీరికి టికెట్ల ఆశ, గెలుపు ధ్యాస తప్ప ప్రజల గోస పట్టడం లేదని, బయ్యారం ఏజన్సీలో ఎలాంటి సాగునీటి వసతులు లేక వర్షాధారంపై ఆధార పడుతున్నారు. వర్షాలు అనుకూలంగా పడక ఏటా చేతికొచ్చే దశలో పైర్లు నిలువునా ఎండిపోతున్నాయి. పూర్తిగా ఎత్తిపోతుల ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా మండలంలోని ఏజెన్సీ, మైదాన గ్రామాలన్నింటికీ సాగునీటి సౌకర్యం కల్పించవచ్చు. బయ్యారం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గా చేసి దీని నుండి తులారం ప్రాజెక్టుకు నీరందించటం ద్వారా మైదాన గ్రామాలన్నింటికి సాగు నీరు అందించవచ్చు, కాని గత కేసీఆర్ ప్రభుత్వం తలాపున వున్న గోదావరి నీటిని ఈ ప్రాంతానికి ఇవ్వకుండా బయట ప్రాంతాలకు తరలిస్తూ ఏజెన్సీ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని రైతులు వాపోతున్నారు. దీని కోసం అధికారులపై, ప్రజా ప్రతినిధులపై ప్రజలు, రైతులు ఒత్తిడి పెంచాల్సిన అవసరం వుంది, సుదీర్ఘ కాలంగా నిర్లక్ష్యానికి గురవుతున్న బయ్యారం చెరువు అభివృద్ధి కోసం, బయ్యారం మండలానికి సీతారామ ప్రాజెక్టు నీటిని సాధించటానికి రైతాంగం పోరాడాలి.

● రాష్ట్రాలు మారిన తలరాత మారని చెరువు..

కాకతీయుల నాటి బయ్యారం చెరువును అభివృద్ధి పరచడంలో గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో, తెలంగాణ తెచ్చుకున్న గత కేసీఆర్ ప్రభుత్వంలో చెరువు అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 2016 సంవత్సరంలో భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను రోళ్ల పాడు చెరువుకు నీటిని ఎత్తిపోసి అక్కడి నుండి బయ్యారం చెరువుకు గ్రావిటీ ద్వారా నీటిని అందిస్తామని శిలాఫలకం వేసిన గత ముఖ్యమంత్రి ఆపనులను మరచి, బయ్యారం చెరువుకు గోదావరి నీటిని రాకుండా అప్పటి ప్రజా ప్రతినిధులు రీ డిజైన్ పేరుతో మార్చి వేసి, ఈ ప్రాంతంలోని రైతులకు తీవ్ర అన్యాయం చేశారు.

ఎలాంటి అభివృద్ధికి నోచుకోని చెరువు



మండల రైతాంగానికి జీవన ఆధా రమైన బయ్యారం పెద్ద చెరువు ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా పని తీరులో ఎలాంటి మార్పు రావడం లేదు. శిథిలావస్థకు చేరుకుంటున్న పెద్ద చెరువును అభివృద్ధి పరిస్తే బయ్యారం, గార్ల మండలాల రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి సీతారామ ప్రాజెక్టు ద్వారా బయ్యారం పెద్ద చెరువుకు నీరు అందించాలి.

-నంబూరి మధు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

● సీపీఐ(ఎం) శాఖ వినతి
● సానుకూలంగా స్పందించిన సొసైటీ చైర్మన్..



నవతెలంగాణ-గార్ల:
మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో సుందరయ్య కాలనీ (ఎస్సీ) కాలనీ లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు వంగూరి వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణిలు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్‌కు సోమవారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ అధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో అంతర్గ రోడ్లు, డ్రెయినేజీలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈనెల ఉగాది సందర్భంగా కొండలమ్మ దేవాలయంలో మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరుగుతాయని, అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును భక్తులకు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపాదికన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంటనే స్పందించిన సోసైటి చైర్మన్ దుర్గా ప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లి సీసీ రోడ్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమం లో సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి వంగూరి కొండయ్య, యూత్ నాయకులు వీపీ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

● ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు
● వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-మహబూబాబాద్
రాబోయే తెలంగాణ బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయి ంచాలని ఎస్ఎఫ్ఐ మహబూ బాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు సోమవారం ఈసందర్భంగా ఎస్ ఎఫ్ఐ అధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీనాయక్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులకు సాల్కర్‌షిప్‌లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ సింహాద్రి, మహబూబాబాద్ పట్టణ అధ్యక్షుడు పవన్, జిల్లా నాయకులు వంశీ, అరుణ్, మహేష్ వినోద్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులపై దాడి.. ముగ్గురికి గాయాలు

● కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-పెద్దవంగర:
అక్రమ విద్యుత్ కనెక్షన్లను తొలగించడానికి వెళ్లిన విద్యుత్ ఉద్యోగులపై దాడి జరిగింది. కర్రలతో దాడికి పాల్పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని రామచంద్రు తండాలో సోమవారం జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ మండలానికి చెందిన గూగుల్ పవన్ కళ్యాణ్ మండలంలోని బొమ్మకల్, వడ్డెకొత్తపల్లి గ్రామాలకు గత కొన్నేళ్లుగా అసిస్టెంట్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. రామచంద్రు తండాలో 55-06 ట్రాన్స్‌ఫార్మర్ కింద పలువురు రైతులు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లతో మోటర్లు వినియోగిస్తున్నారని విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈనేపథ్యంలో పవన్‌కళ్యాణ్‌తో పాటు, మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన కేశబోయిన అశోక్, పెద్దవంగర గ్రామానికి చెందిన చిన్నసాని పుల్లయ్య సదరు అక్రమ విద్యుత్ కనెక్షన్ తొలగించడానికి వెళ్లారు. వీరిపై రామచంద్రతండాకు చెందిన జాటోతు మహేందర్, జాటోతుయాకన్న, జాటోత్ యాకు, జాటోత్ సురేష్ అను నలుగురు వ్యక్తులు కలిసి కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు విద్యుత్ ఉద్యోగులకు గాయాలయ్యాయి. పవన్ కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గం

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య
● పార్టీలో చేరికలు

నవతెలంగాణ-మహబూబాబాద్
మహబూబాబాద్ మున్సిపాలిటీ 16వ వార్డులోని రాహుల్ నగర్ కాలనీలో వివిధ పార్టీల నుండి 50 కుటుంబాలు సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, పట్టణ కార్యదర్శి, మాజీ వార్డు కౌన్సిలర్ బానోతు సీతారాంనాయక్, పట్టణ కమిటీ సభ్యురాలు చాగంటి భాగ్యమ్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా బానోతు సీతారాంనాయక్ అధ్యక్షులు జరిగే కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు, స్థానిక మున్సిపాలిటీకి రావలసిన నిధులు దారి మళ్లించి సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6గ్యారెంటీల పథకాలను వెంటన్నే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్థానిక సమస్యలను వెంటన్నే పరిష్కరించకపోతే ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా వివిధ పార్టీలనుండి సీపీఐ(ఎం) పార్టీలో చేరిన వారిలో చెన్నెల్లి స్వామి, ఎడ్ల భిక్షపతి. బైరుమూళ్ళ రవి, జంగళ ఉమా, కళ, బంగి భిక్షం, అనుపర్తి మహేష్, పాశం రవి, దేవి, గోపి, ఎంపటి యాకయ్య నిరుడు వెంకటేశ్వర్లు. పూల ప్రవీణ్. మీసాల రమేష్, పూల యాకయ్య. గువ్వా జనార్దన్, చల్లాం యాకన్న, వసంత, నరేష్, గువ్వా అంజయ్య, ఎండీ ముగ్దుంమియా. బాబురావు, బి.వెంకన్న, జమీనా, జి.ఉమా తదితరులు పాల్గున్నారు.

కాకిరాల దుర్గ భవానికి ఏపీజే అబ్దుల్ కలాం పరిశోధన అవార్డు ప్రధానం



నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్
మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కాకిరాల దుర్గాభవాని ప్రతిష్టాత్మక తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నుండి ఏపీజే అబ్దుల్ కలాం పరిశోధన అవార్డును అందుకున్నారు. దుర్గ భవాని చేస్తున్న పరిశోధన ప్రయత్నాల్లో భాగంగా ఈఅవార్డును ప్రధానం చేసినట్లు తెలిపారు. తన పరిశోధనను గుర్తించి ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు కేవలం ఒక విజయం మాత్రమే కాదు ఎస్ఆర్ఎంలోని నిర్వహణ అధ్యాపకులు, తోటి పరిశోధకులు నుండి ప్రేరణ, మద్దతు ప్రోత్సాహానికి నిదర్శనమమన్నారు. యూనివర్సిటీ అధ్యాపక బృందం అందించిన అమూల్యమైన మార్గదర్శకత్వం, వనరులు, అవకాశాలు అందించకపోతే ఈ అవార్డు సాధ్యం అయ్యేదికాదని, పరిశోధన నైపుణ్యం, ఆవిష్కరణలను పెంపొందించడంలో వారి నిబద్ధతకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, నిరంతర ప్రేరణకు మూలంగా ఉన్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభావంతులను గుర్తించి నిర్వహించిన మండలవాసి దుర్గ భవాని పరిశోధనలను గుర్తించిన ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు ప్రధానం చేశారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో పరిశోధనలు నిర్వహించేందుకు ఈ పురస్కారం దోహదపడుతుందని ఆమె తెలిపారు. దుర్గ భవాని తొర్రూర్ పీఏసీఎస్, డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ కుమార్తె.

ప్రజా పోరాటాలకు రూపకల్పన..!

● మరిపెడలో నేడు సీపీఐ(ఎం) జిల్లా సదస్సు
● కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాక

నవతెలంగాణ-మరిపెడ
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల రూపకల్పనకు సీపీఐ(ఎం) సిద్ధమవుతుంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే గొంతుకులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నాయని ఆ పార్టీ నేతలు బాహటంగానే విమర్శిస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం నిరుద్యో గులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మతం, కులం మధ్య అడ్డుగోడలు పెడుతూ ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వా మ్యాన్ని హరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తు ఒదన్నారు. అంతేగాక రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం తన గుప్పట్లో పెట్టుకుని రాష్ట్రాలకు రావలసిన బిల్లులను రానివ్వకుండా అడ్డుకు ంటుందని, ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, బొగ్గు గనులు, స్టీల్ ప్లాంట్, లాంటి వాటిని ప్రైవేటుపరం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను అమలులోకి తీసుకొచ్చిందని తద్వారా రైతాంగం ప్రాణాలు అర్పించి పోరాటాలు చేసిన ఫలితంగా చట్టాలను వెనకకు తీసుకోవడం జరిగిందని. పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేయకుండా గత రెండు సంవత్సరాల నుండి కాలయాపన చేస్తుందని. ఎన్నో కార్మిక ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం రద్దు చేయాలని కుట్రలు పన్నింది. అంతేగాక వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేయాలని చేస్తుంది. నిత్య అవసరాల ధరలు అవకాశాన్ని అంటుతున్న నరేంద్ర మోడీ నోరు విప్పడం లేదని కమ్యూనిస్టుల పార్టీలు ఆరోపిస్తున్నాయి. కేంద్రం పరిస్థితి ఇలా ఉంటే.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వమని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా దాటివేస్తున్నారని విమర్శలు వస్తు న్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా లేదని, బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని ప్రారంభించాలని సీపీఐ(ఎం) గత ఐదు ఏళ్లకానుండి పోరాటాలు చేస్తున్న జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వామపక్షాలతో కలిసి రావడం లేదని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా ఈప్రాంత ప్రజలు, నిరుద్యోగ యువకులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్న ఈప్రాంత ప్రజలను అవమానపరుస్తూ కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని వామపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. మరోపక్క సాగునీరు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు అప్పుడే మొదలైనాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ గడుపుతున్నాయని నేతలు విమర్శిస్తున్నారు. అంతేగాక పేదోడి ఇంటి కల నెరవేరుస్తామని హామీలు ఇచ్చిన అమలుకు నోచుకోక ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఇచ్చిన ఆరుగ్యారంటీల సంగతేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటిలో పరిస్థితులను నెమరు వేసుకొని జిల్లాలో ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలంగా నిర్మించాలని ఆలోచనతో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఐ(ఎం) జిల్లాస్థాయి వర్క్ షాప్ జిల్లాలోని మరిపెడ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



● నేడు మరిపెడలో జిల్లా సదస్సు
● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య

ప్రజా పోరాటాల రూపకల్పన చేయటానికి మరిపెడ జిల్లా వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు మరిపెడ మండలం నిర్మాణ బాధ్యులు అలువాల వీరయ్య తెలిపారు. మరిపెడ పట్టణ కేంద్రంలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఉద్యమ నిర్మాణ బాధ్యులు కామ్రేడ్ గొల్లపల్లి నాగయ్య , జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ తోపాటు సుమారు 200 ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. మరిపెడ (బంగ్లా) కేంద్రం ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజుల నుండి జిల్లా సదస్సుకు జయప్రదం చేయడానికి మండల కమిటీ తీవ్ర కృషి చేసిందని మధుసూదన్ తెలిపారు. కావున పార్టీ నాయకులు ప్రజాతంత్ర ఉద్యమం నేతలు, ప్రజాసంఘాల బాధ్యులు తప్పనిసరిగా ఈ సదస్సుకు హాజరై మరి ఇప్పుడు జరిగే ప్రదర్శనకు పాల్గొనాలని మధు కోరారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి కుంట్ల నాగన్న



నవతెలంగాణ-మహబూబాబాద్
హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి కుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం హమాలీ సంఘం సమావేశం బత్తుల వెంకన్న అధ్యక్షతన నిర్వహించగా సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న హాజరై మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా హమాలీలుగా పనిచేస్తున్న హమాలీ కార్మికులకు మూడు నెలలు పని ఉంటుందని మిగిత 9 నెలలు పని దొరకక వారి కుటుంబాలు దుర్భర జీవితం గడుపుతున్నాయన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వమే పని కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని లేబర్ కార్డులు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి హమాలీకి నెలకు రూ.పదివేల చొప్పున కార్మికులకు ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వన్ని కోరారు. హమాలీలకు వ్యక్తి గత ఇన్సూరెన్స్ చేయించాలని ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బత్తుల రవి, హేమలక్ష్మణ్, లాలు, సేవ్యా నవీన్, రాజు, వీరన్న కోటి, రాజేష్, జనార్ధన్, బాలు, నాగరాజు, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సమస్యను వెంటనే పరిష్కరించాలి

● ఈనెల 20న కలెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ-మహబూబాబాద్
జిల్లాలో ఇసుక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని, వెల్ఫేర్ బోర్డులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డు ఆన్లైన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుల రాజు, కుంట ఉపేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండా ఉప్పలయ్య తాడబోయిన శ్రీశైలంలు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించే క్రమంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటన చేసిందని, అలా కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. . అలాగే భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా కార్మిక శాఖ అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు గారె కోటేశ్వరరావు, బానోతు శంకర్, కారపాటి వెంకన్న, ఎల్.శ్రీనివాస్, భూక్యా రాము, భూక్య బిచ్యా తదితరులు పాల్గొన్నారు.

మహిళా టీచర్లకు సన్మానం

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలంలోని సూరారం హైస్కూల్ కాంప్లెక్స్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సూరారం హై స్కూల్ ఇన్చార్జి హెచ్ఎం సతీష్ ఆధ్వర్యంలో మహిళల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా మహిళలకు ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం ప్రకటించారని, వారికి అన్ని విధాల సెలవులు ఇతర పని దినాలు మహిళా హక్కులకు సంబంధించిన జీవోను జారీ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి పెళ్లి పాఠశాల హెచ్ఎం చల్లమండయ్య, సూరారం హెచ్ఎం ఎం ఎర్రయ్య, గ్రామ కార్యదర్శి అంజలి, ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-మంగపేట



మండలంలోని చుంచుపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు చిన్నపాక యమున ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా యమునా మాట్లాడుతూ ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రా ఆదేశానుసారం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా విద్యార్థుల రక్త నమూనాలను సేకరించడంతోపాటు అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కళ్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గండ్ర దంపతులు

నవతెలంగాణ-రేగొండ



భక్తులు కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా పేరుగాంచిన లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం సోమవారం కన్నుల పండుగ జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతి ఏటా పాల్గొన మాసంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం పూజారులు ప్రత్యేక పూజలతో స్వామివారికి ధ్వజారోహణం, గరుడ ముద్దను నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక అలంకరణతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో ఆలయ ఆవరణంలోని కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దిన మండపంలో స్వామివారి కల్యాణాన్ని పండితులు వైభవంగా జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ముల్క నూరి బిక్షపతి, ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేష్ లు కళ్యాణ వేడుకల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించారు. చిట్యాల సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

మొక్కులు చెల్లించుకున్న 'సిరికొండ'

సుప్రసిద్ధ శ్రీ కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ వేడుకల సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు పున్నం రవి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, ఆలయ ధర్మకర్తలు మల్ల బోయిన శ్రీధర్, మూల ఓంకార్, ఇల్లి కళావతి రవి, ఆకుల రమేష్, కొలెపాక సాంబయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం

నవతెలంగాణ-మంగపేట



మండలంలోని కమలాపురం బిల్ట్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక వేద అధ్యయన కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం పద్మావతి అలివేలు మంగలతో వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, వంశీ కుమారచార్యుల బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈనెల 8వ తేదీ నుండి ఆలయంలో వార్షిక వేద అధ్యయన కళ్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా సోమవారం వెంకటేశ్వర స్వామి కళ్యాణం సందర్భంగా ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతర నిర్వహించిన కళ్యాణ తంతులో భాగంగా అమ్మవార్లను స్వామివారిని అలంకరించారు. ఉదయం 10:30గంటలకు పద్మావతి అలివేలు మంగలతో వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ తంతును తిలకించేందుకు కమలాపురం గ్రామస్తులతోపాటు మంగపేట బోరునరసాపురం కొత్తపేట, బిక్షంపేట తదితర గ్రామాల నుండి సందర్శకులు వందలాదిగా తరలివచ్చారు. కళ్యాణ తంతు ముగిసిన అనంతరం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, ఈ వేడుకలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు స్థానిక ఎస్సై టివిఆర్ సూరి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కళ్యాణ తంతు ముగిసిన తరువాత ఆలయ అర్చకులు ఎస్సై టీవీఆర్ సూరితోపాటు తహసీల్దార్ తోట రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసులకు స్వామివారి శేష వస్త్రాలను బహూకరించారు. ఈ కళ్యాణోత్సవం సందర్భంగా కోలాట బృందాలు భజన బృందాలు ప్రదర్శించిన కళారీతులు కళ్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పద్మారావు, సిద్ధబత్తుల జగదీష్, పచ్చ శేషగిరిరావు, రామాలయం సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు కోరికొప్పుల శంకర్, చంద్రాచారి, జక్రయ భజన బృందం, కోలాట బృందాలు పాల్గొన్నాయి.

ఊకే బుచ్చయ్య సేవలు మరువలేనివి

ఉమ్మడి లింగాల గ్రామ పంచాయతీ ఏజెన్సీ ఉద్యోగుల సంఘం

నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతమైన ఉమ్మడి లింగాల గ్రామపంచాయతీ ఏజెన్సీలో 60 సంవత్సరాల పోస్ట్ ఆఫీసులో ఏబిపిఎం విధులు నిర్వర్తించిన కీర్తిశేషులు ఊకే బుచ్చయ్య సేవలు మరువలేనివి అని ఉమ్మడి లింగాల గ్రామపంచాయతీ ఏజెన్సీ ఉద్యోగుల సంఘం నేతలు అన్నారు. సోమవారం ఏబిపియం ఊకే బుచ్చయ్య దశదినకర్మకు హాజరై రూ.10 వేల ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు అందించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 60 సంవత్సరాల క్రితం ఉమ్మడి లింగాల గ్రామపంచాయతీ పరిధిలో ఎడ్లబండ్లు నడిచేవి తప్ప ఎలాంటి వాహనాలు నడిచేవి కావన్నారు. ఆ సమయంలో అతి తక్కువ జీతంతో పోస్టల్‌లో(జిడిఎస్) ఉద్యోగం పొంది, సైకిల్ మీద ప్రయాణిస్తూ పోస్ట్ ఆఫీస్‌లో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆయన అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరం అన్నారు. బుచ్చయ్య కుటుంబానికి ఉమ్మడి లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని ఏజెన్సీ ఉద్యోగుల సం ఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ గ్రామ పంచాయతీల ఉద్యోగులు మొగిలిపల్లి లక్ష్మయ్య, సమ్మయ్య, ఊకె నాగేశ్వరరావు, యాప్ సమ్మయ్య చీర కృష్ణ, గుమ్మడి ప్రభాకర్, పూణెం సమ్మయ్య, మొగిలిపల్లి కృష్ణ, ఏజెన్సీ ఆదివాసీ ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి యూనియన్ ఆర్థిక చేయూత

నవతెలంగాణ-గోవిందరావుపేట

గుండెపోటుతో మృతిచెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించి ఆటో యూనియన్ తన ఔదార్యాన్ని చాటుకుంది. సోమవారం మండలంలోని పస్రా గ్రామంలో ఇటీవల ఆటో డ్రైవర్ సురేష్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. సురేష్ కుటుంబాన్ని ఆటో యూనియన్ ఆర్థికంగా ఆదుకొంది. భవిష్యత్‌లో కూడా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహస్ర ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాగం శేఖర్ వైస్ ప్రెసిడెంట్ చర్ల శ్రీను కోశాధికారి గంధమాల సురేందర్ సీనియర్ డ్రైవర్ గడ్డం వెంకన్న, అయిలీ అశోక్ వేలు కాళిదాస్.. సభ్యులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు తాగునీరు,కరెంట్ సౌకర్యాలు కల్పించాలి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

నవతెలంగాణ వాజేడు :



వాజేడు మండల కేంద్రంలోని గుడిసె వాసులకు తాగు నీరు,విద్యుత్ సౌకర్యం కల్పించి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్ కోరారు. సోమవారం సంఘం వాజేడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరన్నర కాలం నుండి వాజేడు మండల కేంద్రం మండపాక సమీప ప్రభుత్వ భూమిలో, మండలానికి చెందిన వివిధ గ్రామాల నుండి, గోదావరి వరద ముంపు ప్రాంతాల బాధితులైన ఆదివాసీలు ఇతర పేద,నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. వారికి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారనిఅన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గుడిసేవాసుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే గుడిసె వాసులందరినీ ఏకం చేసి పాదయాత్ర ద్వారా ఐటీడీఏను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు బొగ్గుల రామలక్ష్మి,నాగమణి, శారద, సోనియా పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా బీఆర్ఎస్

నవతెలంగాణ-గోవిందరావుపేట

నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలబడింది. సోమవారం మండలంలోని చల్వాయి గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో బండారి లావణ్య మరణించింది. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందునాయక్, బండారి లావణ్య భర్త బండారి కిరణ్‌ను, వారి పిల్లలను కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. నిరుపేద కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. గోవిందరావుపేట మండల అధ్యక్షులు లకావత్ నరసింహనాయక్, చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షులు నాం పూర్ణచందర్, మాజీ సర్పంచ్ దేవుడు సమ్మయ్య, భూ రెడ్డి మధు, బొల్లం ప్రసాద, రేండ్ల శ్రీను, కొంపెల్లి కృష్ణారెడ్డి రామ్‌రెడ్డి, గోదా కనకయ్య, కుమ్మరి వెంకన్న, బొడిగ రఘువీర్, చెల్లా సురేష్ సుర్జ, సంపత్, మీస బీరయ్య పాల్గొన్నారు.

వర్ధన్ చందర్‌కు పరామర్శ

మండలంలోని పస్రా గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వర్ధం చందర్ రాజు తల్లి వర్ధం లక్ష్మి అనారోగ్య కారణాలతో సోమవారం మరణించింది. బీఆర్ఎస్ నాయకులు వర్ధం చందర్ రాజుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చందర్ రాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ములుగు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందు నాయక్ అన్నారు. మండల అధ్యక్షులు లాకావత్ నరసింహనాయక్ మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు మాజీ ఎంపీటీసీలు వెలిశాల స్వరూప రామచంద్రనాయక్, చల్వాయి మాజీ సర్పంచ్ దేవుడు సమ్మయ్య, పస్రా గ్రామ కమిటీ అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస చారి చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షులు నాం పూర్ణచందర్ భూ రెడ్డి మధు బొల్లం ప్రసాద్, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు తగవు : ఏడీఈ సుధాకర్

నవతెలంగాణ-మంగపేట

విధి నిర్వహణలో భాగంగా తెలంగాణలో పనిచేస్తున్న తనపై అవినీతికి పాల్పడడమే కాకుండా ఆంధ్ర పాలన కొనసాగిస్తున్నాడంటూ ఉద్దేశపూర్వకంగా ఓ యూట్యూబ్ ఛానల్‌లో అసత్యపు కథనాలను ప్రచారం చేయడం తగదని విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వి సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై వస్తున్న అసత్యపు కథనాలను ఖండించారు. విద్యుత్తు పనులకు సంబంధించి కొంతమంది కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా తనను ఇబ్బందులకు గురి చేయడానికి ఈ విధమైన కథనాలను ప్రచురిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమకు చెందిన తాను రాష్ట్ర విభజన సందర్భంగా దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ఈ ప్రాంతంలో తన విధులను నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. మండలంలోని చెరుపల్లికి చెందిన ఓ వినియోగదారుడు చేసిన ఫిర్యాదును పరిష్కరించేందుకు ఆ గ్రామం వెళ్ళినందుకు, కాంట్రాక్టు పనులు దక్కనందుకు తనపై అక్కసుతో మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్న తనకు రాజకీయ రంగును పులిమి స్వార్థపూరితంగా తనపై ఇచ్చే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని తన వివరణ తెలుసుకొని వార్తలను ప్రచురించాలని కోరారు. తనపై యూట్యూబ్ ఛానల్, సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నాడు. తన పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ఎవరు నమ్మవద్దని, నేరుగా తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఏటూరునాగారం ఐటిడిఏ : తనపై కొంత మంది కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏటూరునాగారం విద్యుత్శాఖ ఏడీఈ సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్శాఖ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది కాంట్రాక్టర్లు కావాలని లంచాలు తీసుకున్నారని, ఎలాంటి అక్రమాలకు పాల్పడకున్న పాల్పడినట్లు బయట ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. విద్యుత్శాఖ నిబంధనల ప్రకారం లోబడి పనిచేయడం జరుగుతుందన్నారు. ఆంధ్ర, తెలంగాణ అని వేరు చేసి మాట్లాడడం కరెక్టు కాదన్నారు. ఇలాంటి వ్యక్తులపై కేసు పెడుతానని ఆయన వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్యను పట్టించుకోకుంటే, నిబంధనలను అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి : ఎమ్మార్పీఎస్

నవతెలంగాణ-మహదేవపూర్

అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు, ఓబీసీ సర్టిఫికెట్లు కూడా జారీ చేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఒక్కో సర్టిఫికెట్ కు రూ. పది వేల నుండి రూ.50వేల వరకు పర్యవేక్షణ లేకనే అక్రమాలు తహసిల్దార్ కార్యాలయం వేదికగా జరుగుతున్నట్లు తెలిపారు. గతంలో కూడా బీసీలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేసిన సందర్భాలున్నాయన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుండి నిరసన దీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-మహదేవపూర్

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేటి నుండి నిరసన దీక్షలు ప్రారంభమవుతాయని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేసి తీరుతామని నిండు అసెంబ్లీలో మాట ఇచ్చి తప్పిన రేవంత్ రెడ్డి తక్షణమే వర్గీకరణ చేపట్టాన్నారు. అప్పటి వరకు గ్రూప్ 1 గ్రూప్ 2 తదితర పోస్టులు భర్తీ చేయొద్దు అన్నారు. అలా చేస్తే మాదిగలకు తీవ్రమైన అన్యాయం చేసి నట్టేనని అన్నారు.

రాష్ట్రస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో

జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ క్రీడాకారులకు 12 పథకాలు

నవతెలంగాణ - ములుగు

ఈ నెల 7,8,9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కోహెడ లో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ ఛాంపియన్షిప్ కమ్ నేషనల్ సెలక్షన్స్ లో ములుగు జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనపరిచి 12 పథకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారు. ఈ క్రీడాకారులు హర్యాణలోని పంచకులలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ నాయక్ సోమవారం తెలిపారు.క్రీడాకారులని ములుగు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాదాం ప్రవీణ్, జిల్లా క్రీడల అధికారి తులా రవి, అభినందిచరు. ఖేలో ఇండియా సెంటర్ లో సైక్లింగ్ సాధన వలన క్రీడాకారులకు స్పోర్ట్స్‌లో మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రస్తావించారు. ములుగు జిల్లా లో సైక్లింగ్ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-గోవిందరావుపేట

గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని పస్రా గ్రామం దయ్యాలవాగు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దయ్యాల వాగు సమీపంలో ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పస్రా పోలీసులు ములుగు ఏరియా హాస్పిటల్‌కి పంపించారు. చికిత్స పొందుతూ మృతిచెరందాడు. ఇతనికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే పస్రా పోలీసులు 871 2670085, 8712670086నెంబర్లలో తెలియజేయాలని సూచించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్

నవతెలంగాణ-రేగొండ

విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని రంగయ్యపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ అన్నారు. సోమవారం రేగొండ మండలం రంగయ్యపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రీతమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్కిటెక్చర్ విభాగంగా, విద్యార్థులకు సృజనాత్మకత తో ఆర్కి టెక్చర్ డిజన్స్ పాఠశాల సంబంధించిన నిర్మాణాలు, డిజైన్స్ వెయ్యడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీయాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రీతం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ క్రియేటివ్ క్లబ్ కోఆర్డినేషన్ శ్రీహరి, జిల్లా కోఆర్డినేటర్ మైసబాబు, మెంటర్ మంద రవి, యూత్ ట్రైనర్ అనిల్ కుమార్, ఎక్స్పర్ట్ మేడం శిల్ప, లలిత్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎంకు వినతి

నవతెలంగాణ-మహదేవపూర్

తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు బడ్జెట్లో కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధికార ప్రతినిధి హైబోధిన ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రికి ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు ఏ విధంగా హామీలు ఇచ్చి అమలు చేస్తున్న ప్రభుత్వం మాకు కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలాలు ప్రతినెల 25వేల పింఛన్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మేసినేని వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ)

నవతెలంగాణ-మహదేవపూర్

ఈనెల 17న జయశంకర్ జిల్లా కేంద్రంలో జరిగే భవన నిర్మాణ కార్మికుల సంఘం 3వ మహాసభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కుడుదుల వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమ వారం మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికులు సం ఘం కార్యాలయంలో కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో అనేక పోరాటాలు చేసి 1996లో నాటి కేంద్ర మం త్రి ఇంద్రజిత్తు గుప్తా, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి చతుర మిశ్రా ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న ప్రమాద సహజ మరణం శాశ్వత పాక్షిక అంగవైకల్యం పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్లు ఇచ్చి బాధ్యతనుండి తప్పించుకోవాలని చూస్తుందని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు యధావిధిగా కొనసాగేలా కృషి చేశారని అన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణాలకు రూ.10లక్షలు, సహజమరణానికి, అంగవైకల్యానికి రూ.5 లక్షలు, వివాహ, ప్రసూతి కానుకలుగా లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ బండారి లావణ్య, లక్ష్మీరాజ్యం, గోనె రవి, రాముడు సదానందం, కామెడీ మల్లన్న, కాగిత పద్మ, కార్మికులు బల్ల శ్రావణ్, పోతుల సదయ్య, అయిలి సాంబ మూర్తి, సమ్మయ్య ఉదరి గట్టయ్య, జోడు శేఖర్, అనిల్, రాకేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజా ఫ్రంట్ 3వ మహాసభలు

విజయవంతం చేయండి : జిల్లా కో కన్వీనర్‌పార్వతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

తెలంగాణ ప్రజా ఫ్రంట్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కో కన్వీనర్ దుబాసి పార్వతి,కుడమేత సరస్వతి పిలుపునిచ్చారు. సోమవారం మహాసభల కరపత్రాలను కొయ్యూర్ గ్రామంలో ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. ప్రశ్నించే గొంతులపై కొత్త కొత్త చట్టాలు ప్రయోగిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలంతా ఏకమై అన్ని రకాల దోపిడి పీడనలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈక్రమంలో నిర్వహించే సభకు ప్రజలు ప్రజాస్వామిక వాదులు, మేధావులు కార్మికులు కర్షకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లన్న,రాజన్న,శ్యామల,సూరక్క,శ్రీలత,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక డీఎల్ఎస్సి నిర్వహించాలి

ఇసుక సొసైటీల జిల్లా అధికార ప్రతినిధి దబ్బకట్ల సుమన్

నవతెలంగాణ - ములుగు

ఇసుక డిఎల్ఎస్సి నిర్వహించాలని, సంవత్సరం గడిచిన డీఎల్ఎస్సి నిర్వహణ చేయకపోవటంలో ఆంతర్యం ఏమిటి ఇసుక సొసైటీల జిల్లా అధికార ప్రతినిధి దబ్బకట్ల సుమన్ ప్రశ్నించారు. జిల్లాలోని వెంకటాపురం, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం,వాజేడు మండలంలోని గిరిజన ఇసుక సొసైటీలకు ప్రభుత్వం జాయింట్ సర్వే నిర్వహణ చేసి నేటికి సంవత్సరం గడుస్తున్నా డిఎల్ఎస్సి నిర్వహించక పోవటంతో వివిధ గిరిజన ఇసుక సొసైటీల అధ్యక్షులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతులు ఇచ్చారు. ఇసుక సొసైటీల జిల్లా అధికార ప్రతినిధి దబ్బకట్ల సుమన్ మాట్లాడుతూ గిరిజనుల ఇసుక సొసైటీలకు డిఎల్ఎస్సి నిర్వహించక పోవటంలో జిల్లా కలెక్టర్ ఆంతర్యం ఏమిటని అన్నారు. సీతక్క వెంటనే స్పందించి ఇసుక డిఎల్ఎస్సి నిర్వహణకు జిల్లా కలెక్టర్ కి ఆదేశాలను జారీ చేయలని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్షిక, సతీష్, నర్సయ్య,సురేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కరించాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్

నవతెలంగాణ -ములుగు

ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసిల సమస్యల పరిష్కరించాలనీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ సతీష్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు ఏజెన్సీ ప్రాంతానికి 1970 సంవత్సరం తర్వాత వలస వచ్చిన గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు నిలుపుదల చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం(జెడ్) సర్వేనెం.4/1,4/2, ప్రభుత్వ భూములను ఆక్రమించిన గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంకటాపురం మండలంలో ముత్తారం, శాంతినగర్ గ్రామాలలో కల్వార్టు, ఇంటర్నల్ సిమెంట్ రోడ్డు మంజూరు మంజూరు చేయాలని. జీవో ఎంఎస్ నెంబర్ 3 ను చట్టం చేయాలనీ కలెక్టర్ ను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 5వ షెడ్యూల్ భూభాగంలో ఆదివాసీల రక్షణకై,ఆదివాసిల భూముల రక్షణకై ఏర్పాటు చేశారని అన్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలోనికి 1970 సంవత్సరం తర్వాత మైదాన ప్రాంతంలో నుండి ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చిన గిరిజనేతరుల ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపిక నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల అధ్యక్షులు కుర్సం శివ శంకర్, సున్నం నరసింహ రావు, వాసం కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధత చేశాకే..

ఉద్యోగ పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలి : ఎంఎస్పీ

నవతెలంగాణ - ములుగు

ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధత చేశాకే ఉద్యోగ పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు మడిపెల్లి శ్యాంబాబు మాదిగ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఆవరణంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ములుగులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల అధ్యక్షుడు కోతి కార్తీక్ మాదిగ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు నిర్వహించారు. దీక్షలకు సంఘీభావంగా బీఆర్ఎస్ నాయకులు గండ్రకోట సుధీర్ కుమార్ యాదవ్ పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. అనంతరం శ్యామ్‌మాదిగ మాట్లాడుతూ చట్టబద్ధత చేసినతర్వాతే ఫలితాలను విడుదల చేయాలని, అప్పటివరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా విడుదల చేస్తున్న ప్రకటన నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపడతామని, అందుకోసం క్యాబినెట్ తీర్మానం మేరకు మార్చి 12 వరకు అసెంబ్లీలో వర్గీకరణ చట్టం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటన చేయడం సరికాదన్నారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఉద్యోగ ఫలితాల ప్రకటన, నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మరాఠీ రవీందర్ మాదిగ, ఎంఎస్పి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రోంటాల బిక్షపతిమాదిగ, ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా నాయకులు ఎమ్మెస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు దూడపాక రాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు బొచ్చు అరవింద మాదిగ, ఎమ్మెస్పీ పార్టీ జిల్లా నాయకులు పెండల సుందరం మాదిగ, ఎమ్మెస్పీ మండల నాయకులు కలవాల శ్రీను మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

'స్వార్థం కోసం కాదు ప్రజల కోసం పనిచేస్తాం'

నవతెలంగాణ-టేకుమట్ల

వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేస్తామని బీఎస్పి జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి, సిపిఐఎంల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అన్నారు. టేకుమట్ల ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టేకుమట్ల మండలంలో, జిల్లాలో అనేక అక్రమ దందాలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు కొన్ని రోజులుగా అనే క పోరాటాలు చేస్తున్నామని, తద్వారా శాసనసభ్యులు,అధికారులు స్పందించి వా టిని అరికట్టుటకు అనేక చర్యలు తీసుకున్నారని అన్నారు. కలికోట- ఓడేడు మా నేరుపై వంతెన నిర్మాణం చేయాలని, అక్రమ టోల్ టాక్స్ రద్దు చేయాలని అధి కారులకు వినతిపత్రం అందజేశామని అన్నారు. ప్రయాణికుల బాధలను అర్థం చేసుకుని వెంటనే రోడ్ గుంతలు పూడ్చి వేయించిన ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు కసరవేణి. కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం మండల అధ్యక్షులు నేరెళ్ల రామకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలి : బీజేపీ

నవతెలంగాణ-టేకుమట్ల

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి నుండి నవాబ్‌పేట, సుబ్బక్కపల్లి, సోమనపల్లి. అంకుశాపూర్ గ్రామాల మీదుగా పరకాల ఆర్టీసీ డిపో బస్సు నడిపించాలని టేకుమట్ల బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పరకాలకు వెళ్లాలంటే ఇదే రహదారి మీదుగా సుబ్బక్కపల్లి సోమన్నపల్లి అంకు షాపూర్ నుండి వచ్చే ప్రయాణికులు రోజు వందలాది మంది ప్రయాణికులు ప్రైవేటు వాహనంలో వెళ్లాల్సి వస్తుందని అన్నారు. రోడ్డు సదుపాయం లేదని ఇంతకుముందు నడిచిన బస్సును ఆపివేయడం వల్ల టేకుమట్ల మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరకాల డిపో మేనేజర్ స్పందించి మొగుళ్లపల్లి నుండి నవాబుపేట మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయనవెంట మండల నాయకుడు చిలుక మహేందర్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి పోతన వేణి స్వామి సోమన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మంద వెంకటేష్, గ్రామ కోశాధికారి అబ్బేంగుల రమేష్ తదితరులు ఉన్నారు.

ఎంఈవో అనితాదేవీకి సన్మానం..

నవతెలంగాణ-మరిపెడ



14 ఏళ్ల పోరాటం ఫలితంగా ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో తమను టీచర్లుగా నియమించిందని డీఎస్సీ 2008 సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు భాస్కర్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్సీ 2008 కాంట్రాక్టర్ టీచర్ల ఆధ్వర్యంలో మరిపెడ ఎంఈవో అనిత దేవిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈవోకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్ట్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మెరిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, లలిత, శ్రీదేవి, క్రాంతి ఉపాధ్యాయులు జనార్ధన్, శేఖర్ పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్స తప్పనిసరి

● పశు వైద్యాధికారి రాజశేఖర్

నవతెలంగాణ-పెద్దవంగర:



పశువులకు గర్భకోశ చికిత్స తప్పనిసరిగా చేయించాలని మండల పశువైద్యాధికారి బాల్దు రాజశేఖర్, తొర్రూర్ పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్ రాసాల సమ్మయ్యలు అన్నారు. సోమవారం చిన్నవంగర లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. అనంతరం దూడల ప్రదర్శన, కృత్రిమ గర్భధారణ విధానం కార్యక్రమం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పశుసంపదను వృద్ధి చేసుకోవాలన్నారు. పాల ఉత్పత్తి పెంచడానికి, పశువులు పెరగడానికి రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్ర మంలో పంచాయితీ కార్యదర్శి గీత, ఎల్ఎస్ఏ రాము, తొర్రూర్ ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, గోపాల మిత్రలు, ఎస్‌కే.యాకూబ్ పాషా, మధు, వెంకన్న, గ్రామ ప్రముఖులు పాకనాటి సునీల్ రెడ్డి, పాడి రైతులు మధుకర్, మల్లయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని సీతానగరం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. ప్రధానోపాధ్యాయురాలుగా వి. అక్షయ, ఉపాధ్యాయులుగా నిహారిక, తన్విక, వ్యాయామ ఉపాధ్యాయులుగా బాల కృష్ణలు చక్కగా విధులు నిర్వహించారని అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ పిల్లలు స్వయంగా పాఠాలు బోధించడం వలన వారిలో భయం తొలిగి స్వేచ్ఛా పూరితంగా ఉంటారని భవిష్యత్తులో వాటికి ఒక మధురానుభూతిగా మిగులుతుందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ మేడం శ్రీలత, తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డును క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించాలి

టీజీఎస్ ఆధ్వర్యంలోజేసీబీని అడ్డుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-గార్ల:



మండలంలోని పోచారం క్రాస్ రోడ్డు నుండి ముత్తితండా గ్రామం వరకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణం నాణ్యత లోపంగా వేశారని వెంటనే క్వాలిటీ కంట్రోల్ అధికారులచే పరీక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరి నాయక్ డిమాండ్ చేశారు. బీటీ రోడ్డు నిర్మాణం అనంతరం మట్టి పోసేందుకు వచ్చిన జేసీబీనీ టీజీఎస్ అధ్వర్యంలో సోమవారం గ్రామస్థులు జేసీబీని అడ్డుకొని రోడ్డు పై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు లేకుండా రోడ్డు వేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకుండా నామమాత్రంగా, నాణ్యత లోపంగా రోడ్డు వేసి బిల్లులు కాజేసినందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్‌బీ శాఖ, క్వాలిటీ కంట్రోల్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నాణ్యత లేని బీటీ రోడున్ను పరీక్షించి ప్రజా ధనం వృధా కాకుండా కాపాడాలని లేనిఎడల తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల కార్యాలయాల ముందు తండా ప్రజలతో దశల వారిగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీను, రమేష్, మల్సూర్, శంకర్, ముత్తితండా గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కోటిలింగాల మహా జాతర

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్



మండలంలోని హరిపిరాల గ్రామంలో కోటిలింగేశ్వరస్వామి, అమ్మవారికి ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. సోమవారం ఈపండుగ యాదవ కులస్తులకు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈపండుగ రెండు సంవత్సరాలకొకసారి ఒకసారి జరుపుకుంటారు. ఈపండుగ యాదవ కులానికి ఎంతో ప్రఖ్యాతి గాంచినది. ఈపండుగ పురాతన కాలం నుండి యాదవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారు. ఈపండుగకు చుట్టుపక్కల గ్రామస్తులు, యాదవులు కోటి లింగేశ్వరస్వామికి మొక్కిన కోరికలు నెరవేరుస్తాడని నమ్మకం. ఈపండుగ అంగరంగ వైభవంగా యాదవులు ఈపండుగను ఎంతో పురాతనమైనది. ఈదేవుడు ఇక్కడి ప్రజలకు, యాదవులకు కనువిప్పు కలిగిస్తున్నది. యాదవులు డప్పుసప్పుళ్లు, బోనాలతో పూజలు నిర్వహిస్తున్నారు. యాదవ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సెక్రెటరీ, తండు వంశస్థులు, పూజారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి నిధులు పెంచాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేటాయించి నిధులు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినారు. గత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.9300కోట్ల ను మాత్రమే కేటాయించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో మూడు శాతం కంటే తక్కువ కాబట్టి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన మేరకు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్ల ను కేటాయించాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు బీసీ సబ్ ప్లాన్ ప్రకటించి బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరారు. కొంతకాలంగా బడ్జెట్‌లో ప్రభుత్వాలు బీసీల సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయిస్తూ కేటాయించిన నిధులను కూడా పూర్తిగా ఖర్చు చేయటం లేదనే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

రైతు భరోసా, రుణమాఫీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

● తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణ-మరిపెడ

రైతు భరోసా రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో రైతాంగానికి వర్తింపచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల మూడవ మహాసభ నీలికుర్తి గ్రామంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వర్‌రావు, సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా, కనీస మద్దతు ధర లేక రైతాంగం ఆత్మహత్యలే శరణ్యంగా మార్చి, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందులో భాగంగానే నల్ల చట్టాలను అమలు చేయాలనే కుట్ర పూరిత విధానాలపై రైతాంగం సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. రైతు సంఘం మండల అధ్యక్ష



కార్యదర్శులుగా అనపర్తి సత్యం, పోలేబోయిన జనార్దన్‌లు ఐదుగురితో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసమావేశంలో నాయకులు మారగాని బాలకృష్ణ, ఎండీ. అబ్దుల్‌రషీద్, గాడిపెల్లి వెంకన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి: తుడుందెబ్బ



నవతెలంగాణ-గూడూరు

అక్రమ కట్టడాలన్ని తొలగించాలని లేనిఎడల తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆక్రమిస్తామని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఈసెం సుధాకర్ అన్నారు. మండలంలోని కేంద్రంలోని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు ఈసం సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి పాడిన నాగేశ్వరరావు దొర, జిల్లా జేఏసీ కన్వీనర్ కొట్టం ముఖర్జీలు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ గ్రామం గూడూరు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన గల ట్రైబల్ పట్టా భూములలో 1/59, 1/70 షెడ్యూల్ ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా నిర్మించినటువంటి అక్రమ నిర్మాణం ప్రభుత్వ ఆసుపత్రి పక్కన అక్రమ నిర్మాణాని తొలగించాలని అట్టి అక్రమ కట్టడం ఆదివాసి ట్రైబల్ పట్టా భూమిలో అక్రమంగా నిర్మించారని, అట్టి భూమిలో అక్రమ నిర్మాణంపై జిల్లా యంత్రాంగం ఆర్‌డీవో, తహసీల్దార్‌లు వెంటనే స్పందించాలని, అక్రమ కట్టడాన్ని పిల్లర్ నిర్మాణాలను తొలగించాలని లేని పక్షంలో వారం రోజుల పక్షంలో చర్యలు తీసుకొని ఎడల సంఘం ఆధ్వర్యంలో తొలగిస్తామని ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని, అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇప్పటికైనా స్పందిస్తూ చర్యలు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని, తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంగయ్య, సునీల్, మల్లేష్,వజ్రయ్య, నాగేష్, లచ్చయ్య, వెంకన్న, సురేందర్ పాల్గొన్నారు.

సావిత్రి బాయిపూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

నవతెలంగాణ-గార్ల:

సావిత్రిబాయి పూలే జీవిత పోరాటాలు, త్యాగాలను నేటి సమాజానికి తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి శ్రీనివాస్, ఐద్వా జిల్లా నాయకురాలు అలువాల సత్యవతిలు డిమాండ్ చేశారు. సావిత్రి బాయిపూలే వర్ధంతిని సీపీఐ(ఎం), ఐద్వా అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయిపూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుల అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ మహిళలపై జరిగే దురాచారాల నిర్మూలన కోసం పోరాడిన క్రాంతి జ్యోతి మాత సావిత్రిబాయి పూలే అని అన్నారు. 1848లో పూనేలో బాలికల కోసం తొలి పాఠశాలను ఏర్పాటుచేసి, ఆ పాఠశాలకు భారతదేశంలోనే తొలి ఉపాధ్యాయురాలుగా పని చేశారన్నారు. అదేవిధంగా జ్యోతిరావు పూలే-సావిత్రిబాయి పూలే దంపతులు శూద్రుల కోసం, మహిళల కోసం అనేక పాఠశాలలు స్థాపించి బహుజన వర్గాల్లో వెలుగులు నింపి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. రైతులు, కార్మికుల మహిళా హక్కుల కోసం అన్ని రంగాల్లో సమానత్వం కోసం సమరం చేసిన క్రాంతి జ్యోతి మాతా సావిత్రిబాయి



పూలే అని తెలియజేశారు. సమాజసేవలో తరించిన ఆమె ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తూ, ఆమె కూడా ఆవ్యాధి సోకి తుది శ్వాస విడిచారని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు జి.వీరభద్రం, ఎస్.నాగరాజు, ఉమావతి, విజయ, సావిత్రి, సుజాత, ఎ.స్వాతి సింధు, ధనలక్ష్మి, ఉషా భార్గవి, విప్లవ జ్యోతి తదితరులు ఉన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

నవతెలంగాణ-గూడూరు



మండల కేంద్రంలో మాతా సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య హాజరై పూలమాల అలంకరించిన అనంతరం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, ఆమె నిమ్నజాతి వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప వీరవనిత, భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన ధీరశాలి సావిత్రిబాయి పూలే అన్నారు. మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తన సామాజిక బాధ్యతగా సావిత్రిబాయి పూలే, జ్యోతిబాపూలే దంపతులు పోరాటం చేశారన్నారు. కత్తిస్వామి మాట్లాడుతూ నేటి యువత సావిత్రిబాయి పూలే మార్గంలో పయనించి ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రజాసేవ, సామాజిక కార్యక్రమాలలో బాధ్యతగా భావించి ప్రజాభివృద్ధికి దోహదపడాలన్నారు. సమాజంలో జరుగుతున్న చెడు మార్గం నుండి మంచి మార్గానికి బాటలు వేయడానికి నేటితరం యువత ముందుండాలని కోరారు. ఈకార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాల వెంకన్న, మండల అధ్యక్షులు చుంచ బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు యాకూబ్ పాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల పాఠశాలలో..

జీపీఎస్ బేతంచర్ల పాఠశాలలో సావిత్రి బాయి పూలే 128వ వర్ధంతిని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఆర్‌పీ వాలు పాల్గొని మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గురించి వారి యొక్క అద్భుత భావాలను పిల్లలకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న ఉపాధ్యాయులు రేగ సాంబయ్య, ఈసం మంజుల, అంగన్‌వాడీ ఆయా కొట్టెం పూలమ్మ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

నవతెలంగాణ- తొర్రూర్‌రూరల్

తొర్రూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలేపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల ప్రవీణ్-వెన్నెలను తొర్రూర్ మార్కెట్ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి సోమవారం పోలేపల్లి గ్రామంలో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు, ఈకార్యక్రమంలో తొర్రూర్ పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, చర్లపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు నాగిరెడ్డి, వాసురెడ్డి, ఎర్రమల శ్రీనివాస్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఎద్దు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి: టీపీటీఎఫ్

నవతెలంగాణ-మహబూబాబాద్

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైసా శ్రీనివాస్ ఉన్నారు. సామూహిక విప్లవ కారిణి సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా మహబూబాబాద్‌లోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు సావిత్రి బాయి పూలేకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ "సావిత్రి బాయి పూలే జీవితమంతా అణగారిన వర్గాలకు విద్య నందించడం, వితంతు మహిళలని అక్కున చేర్చుకుని పునర్వివాహాలు చేయడం, జీవితమంతా ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో తన లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించని ఉద్యమకారిణి అని, చివరికి ఆ లక్ష్య సాధనలోనే భయంకరమైన ప్లేగు వ్యాధి తో మరణించిందన్నారు. నేటి తరం ఉపాధ్యాయులందరూ సావిత్రి బాయి పూలే చూపిన మార్గంలో తమ సేవలందించేందుకు ముందుకు రావాలని కోరారు. మహనీయుల వర్ధంతి, జయంతుల నిర్వహణ వారి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, కార్యదర్శి రాచకొండ ఉపేందర్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, సీనియర్ నాయకులు సోమ విష్ణువర్ధన్, సీరోల్ మండల ప్రధాన కార్యదర్శి సజ్జనపు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌పాఠశాలలో.. పూలే వర్ధంతి

నవతెలంగాణ-కొత్తగూడ



మండలంలోని ఓటాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే వర్ధంతి కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల సాంబయ్య మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు, మహిళల చదువు, సంపద, వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన వ్యక్తి, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్నారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయడం తమ బాధ్యతగా స్వీకరించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని, నూతన వ్యవస్థ కోసం ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టిన తొలితరం మహిళా ఉద్యమకారిణి జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, నరసింహారావు, నారాయణ పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా

ఎస్సై జి.ఉపేందర్

నవతెలంగాణ-తొర్రూర్

భార్యను వేధింపులకు గురిచేసిన కేసులో భర్తకు సంవత్సరం జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై జి.ఉపేందర్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కొడకండ్ల మండలం ఏడునూతలకు చెందిన గాడిపల్లి వెంకన్నకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జీ మట్ట సరిత ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు. 2016 సంవత్సరంలో బొమ్మకల్ గ్రామానికి చెందిన ఒక బాధితురాలు తన భర్త అయిన గాడిపల్లి. వెంకన్న తనను వేధింపులకు గురి చేస్తున్నాడని భర్త పైన దరఖాస్తు ఇవ్వగా అతనిపై అప్పటి ఎస్సైగా ఉన్న సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయగా ఇప్పుడు తుది విచారణ అనంతరం కోర్టులో సాక్షాధారాలను ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతీదేవి, జయలతలు కేసు వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించి తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అతనికి ఒక సంవత్సరం జైలు శిక్ష రూ.1000 జరిమానా విధించినారని ఎస్సై తెలిపారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లా ఉపాధి కార్యాలయం మహబూబాబాద్ ఆధ్వర్యంలో వైఎస్‌కే ఇన్ఫో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రంగారెడ్డి, హైదరాబాద్ నందు గల ఖాళీలను నింపుటకు అర్హత కలిగిన నిరుద్యోగ స్త్రీలకు మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించుటకై ఈనెల 12న జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-28 మధ్య వయసు కలిగి యుండి 10, ఇంటర్, డిగ్రీ(పాస్/ఫెయిల్) విద్యార్హత తో ఆసక్తి గల స్త్రీలు దరఖాస్తు చేసుకోగలరని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కలిగిన స్త్రీలు మార్చి 12న జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం, రూమ్ నెం.25, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కురవి రోడ్, మహబూబాబాద్ .అడ్రస్ నందు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగు జాబ్ మేళాకు అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్‌లతో హాజరై ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం 7093514418 ద్వారా సంప్రదించాలన్నారు.

సావిత్రిబాయిపూలే మహిళా లోకానికి దిక్సూచి



నవతెలంగాణ-గార్ల:

విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి మహిళల్లో చైతన్యం తీసుకుని వచ్చి చదువుకునేలాగా ప్రోత్సహించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే మహిళాలోకానికి దిక్సూచి అని జిల్లా కాంగ్రెస్ నాయకులు గుండా వెంకటరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఉన్న ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతటి త్యాగం చేసిన మహనీయురాలు సావిత్రి బాయిపూలే జయంతిని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు టి.కృష్ణ గౌడ్, బి.హతీరాం, యాకూబ్‌పాషా, పృథ్వీరాజ్, బాబు లాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎఫ్ఐ నివాళులు

సావిత్రి బాయిపూలే వర్ధంతిని డీఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రి బాయిపూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం.శాంతికుమార్, వివిధ సంఘాల నాయకులు అజ్మీర వెంకన్న, శ్రీను, యుగేంధర్,లక్ష్మణ్, సలీం, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

అకుట్ అధ్యక్ష, కార్యదర్శులకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నూతనంగా అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ ఆకుట్ అధ్యక్షులుగా ఎన్నికైన ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన డాక్టర్ ఎల్‌పి రాజకుమార్‌లకు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకుల పల్లి మధు, రిటైర్డ్ ప్రొఫెసర్ పింగళి నరసింహారావు, యూనివర్సిటీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల మాట్లాడుతూ ఎన్నికైన అకుట్ అధ్యాపక కమిటి బాధ్యులందరికి అభినందనలు తెలిపారు. పలు సంస్కరణలతో యునివర్సిటీ అభివృద్ధి, అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని, ఆదిశగా తమ పదవులకే వన్నెతెచ్చేలా తమదైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు.



వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ 10వ శాఖ ప్రారంభం

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వడ్డేపల్లి ప్రశాంత్ నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ 10వ శాఖ సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామికగా నిలుస్తున్నది అన్నారు.1994లో ఆవిర్భవించిన ఈ బ్యాంకు ఇప్పటి వరకు 400 కోట్ల టర్నోవర్ పూర్తి చేసుకోవడం స్ఫూర్తి దాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్ హనుమకొండ జిల్లా డి సి ఓ సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా డి సి ఓఎం నీరజ, జగన్మోహన్ రావు బ్యాంకు డైరెక్టర్లు తోట సంపత్, ముందడ వేణుగోపాల్, పాపిరెడ్డి, కూరపాటి చంద్రమౌళి, గౌసుద్దీన్, పవన్, మందా స్వప్న శ్రీనివాస్, హరినాథ్, ఫౌండర్ డైరెక్టర్ ముత్తిలింగం పాలారం కష్ణమూర్తి బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు మరియు బ్యాంకు సిబ్బంది వ్యాపార ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



నాగుర్ల వెంకన్న జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నడికూడ

తెలంగాణ ఉద్యమకారుడు రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు నడికూడ మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో కేక్‌కట్ చేసి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగూర్ల సంతోష్‌రావు, రైతు నాయకులు వరికెల కిషన్‌రావు, మాజీ సర్పంచులు తిప్పర్తి సాంబశివరెడ్డి, కానుగుల బంగారు బాబు, వంగ కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ నాగూర్ల ధర్మారావు, నాయకులు బైరెడ్డి రాజిరెడ్డి, నాగూర్ల రాజీరు, భాష పోయిన కొమురయ్య, వంగ ఐలయ్య, వర్ధం శ్రీధర్ రెడ్డి, తాళ్లపల్లి రమేష్, పాడి చందర్‌రెడ్డి, ఎర్రబాటి వెంకటేశ్వర్లు, కోడేపాక మొగిలి, సురావు కిషన్‌రావు, సురావు శివరావు, సురావు బాపూరావు, మోర్తల దేవేందర్, మోకిడి రాజన్న, జింక జువ్వ పోషాల్, వరికెల రాజు, కోడేపాక సారయ్య, కిన్నెర ఐలయ్య, భోగం బిక్షపతి, తలగంప స్వామి, బాసిడి బాపూరావు, సురావు దివాకర్, తలగంప నరేష్, సురావు శ్రీనివాస్, అందాపురం యుగంధర్, హింగె రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్ని దానాల కెల్లా రక్తదానం గొప్పది

కేయు విసి ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా


అన్ని దానాల కెల్లా రక్తదానం గొప్పది అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అన్నారు, విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్‌కో ఎడ్యుకేషన్) కళాశాల జాతీయ సేవా పథకం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. రక్తదాన ప్రాముఖ్యత గొప్పది అని, ప్రాణాలని నిలబెడుతుందని, రోడ్డు ప్రమాదాలు, తలసేమియా వారికి రక్త అవసరాలు చాలా ఉంటాయన్నారు.కొన్ని గ్రూప్‌ల రక్తం ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు నుంచి 180కి పైగా యూనిట్ల బ్లడ్‌ను సేకరించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, పాలక మండలి సభ్యులు అనితారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ చైర్మన్ డాక్టర్ పి.విజయ చందర్‌రెడ్డి, డాక్టర్ రాధిక, డాక్టర్ సుమలత, డాక్టర్ వి. మహేందర్, డాక్టర్ అసిం ఇక్బాల్, ప్రోగ్రాం ఆఫీసర్ లు డాక్టర్ డీ. శైలజ, ఎం. సౌజన్య, సహాయ రిజిస్ట్రార్ బి. నేతాజీ, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తల్లిని చంపిన తనయుడు అరెస్ట్

నవతెలంగాణ-ఎల్కతుర్తి

భూతగాదాల విషయంలో తల్లిని హత్య చేసిన కుమారుడిని ఎల్కతుర్తి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ పులి రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామంలో గత శుక్రవారం రాత్రి మృతురాలి చిన్న కొడుకు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడైన అజయ్ కోతుల నడుమ గ్రామం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఎదురుపడడంతో అదుపులోకి తీసుకున్నారు.నేడు కోర్టులో హాజరు పరుస్తామని సిఐ పులి రమేష్ తెలిపారు. ఎవరైనా భూతగాదాల విషయంలో కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ మల్లేషం, కానిస్టేబుల్స్ నిరంజన్, గణేష్, బక్కయ్య రాజయ్య, హోంగార్డ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న ఐఫోన్ అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ-ఆత్మకూరు

లక్ష రూపాయల విలువ గల ఐఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ అప్పగించిన ఆత్మకూరు పోలీస్. సీఐ ఆర్ సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ పట్టణానికి చెందిన దశరథ్ కుమార్ దుర్గంపేట లోని ఓ షాపు వద్ద లక్ష రూపాయల విలువగల ఐఫోన్ మర్చిపోయానని సోమవారం ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి పోలీస్ సిబ్బంది అలెర్ట్ చేసి హెడ్ క్వార్టర్ లో ఉన్న ఐటీ కోర్ సిబ్బంది కి సమాచారం ఇవ్వగా లొకేషన్ ద్వారా ట్రేస్ ఔట్ చేసి ఐఫోన్ ను దొరకబట్టి దశరథ్ కుమార్ కు అప్ప చెప్పడం జరిగిందని సీఐ తెలిపారు. ఐఫోన్ బాధితుడు దశరథ్ కుమార్ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఐఫోన్ ట్రేస్ అవుట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని సిఐ అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో 'గ్లోబల్ మైండ్స్' ప్రతిభ

నవతెలంగాణ-సయీంనగర్



ఇంద్రానగర్, విజయపాల్ కాలనీలోని గ్లోబల్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలో ప్రతిభను చాటారు. సోమవారం స్కూల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో పాఠశాల చైర్మెన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీలో తమ పాఠశాల విద్యార్థి జి. గంగాధర్ కథా రచన విభాగంలో రెండో బహుమతి , జి. అక్షిత్ చిత్రలేఖనం విభాగంలో మూడో బహుమతి . అదనంగా, జి. సాయిగణేష్ , ఎల్. సాత్విక్ రెడ్డి ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారని తెలిపారు. ఈ ఘనత విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి నుజహత్ సుల్తానా , అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ ఆసియా ఫరూకి , శిక్షకులు సురేష్ , రామయ్య లు పాల్గొన్నారు.

సావిత్రి బాయిపూలే ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-నక్కలగుట్ట

సావిత్రిబాయి పూలే స్ఫూర్తిని కొనసాగించాలని బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూబడుగు, బలహీన వర్గాలకు విద్యనందించేందుకు కృషి చేసిన మహనీయురాలు అని, వివక్ష ఎదురవుతున్న విద్యనందించేందుకు పోరాడిన మోధురాలు సావిత్రి బాయి పూలే అని, మహాత్మా జ్యోతి రావు పూలేతో కలిసి బహుజనుల బాగు కోసం పాటు పడిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. మహిళల చదువు కోసం విశేష కషి చేసిన గొప్ప మాతమూర్తి, చైతన్య దీప్తి, విద్యా జ్యోతి సావిత్రి బాయి పూలే హక్కుల సాధన కోసం బీసీలు మహిళలు ఏకతాటిపైకి వచ్చి పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత జాగతి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్యం విజయభాస్కర్ , పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, మేకల బాబురావు, ఉడుతల సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యం అని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ పూలే ప్రాంగణం లో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహాలకు డాక్టర్ మల్లేశ్వర్ పూలమాల వేసి మాట్లాడారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయిపూలే అని కొనియాడారు. పీడిత ప్రజలకు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని కొనియాడారు. కార్యక్రమంలో కేయూ బీసీ



సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, కేయూ రిటైర్డ్ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆచార్య వడ్డే రవీందర్ ఉపాధ్యక్షులు ఎర్రగట్టు స్వామి, ఆచార్యకే పద్మలత, పాస్ జిల్లా నాయకులు, డాక్టర్ జగన్, డాక్టర్ దాడబోయిన శ్రీకాంత్, డాక్టర్ వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దామెర : దేశంలోని నిమ్న జాతి వర్గాలకు విద్య నందించాలనే లక్ష్యంతో తన భర్త మహాత్మా జ్యోతిరావ్‌పూలే అడుగు జాడల్లో నడుస్తూఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ పేద వర్గాలకు విద్యనందించిన గొప్ప త్యాగమూర్తి మాత సావిత్రి బాయి పూలేఅని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కొనియాడారు.సోమవారం దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలైన హక్కుదారులతో పనివద్ద సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అడుగడుగున ఉల్లంఘిస్తూ చట్టాన్ని కూలీలకు దక్కకుండా కుట్రలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కొమ్ముల కర్ణాకర్, కిర్తన, మరియా, చంద్రయ్య,రవి,గోపాల్, కిరణ్,సులోచన పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియమాకాలు చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్

నవతెలంగాణ-ధర్మసాగర్

ఎస్సీ వర్గీకరణ తర్వాతనే ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్‌మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మెయిన్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సోంపల్లి అన్వేష్ మాదిగ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా దయాకర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో ఎస్సీలకు అన్యాయం చేస్తుందన్నారు. వర్గీకరణ పూర్తి కాకుండానే గ్రూప్-1,2,3తో పాటు అనేక పోస్టులకు వారంలోనే ఫలితాలు ఎందుకు ప్రకటించనున్నారని మండి పడ్డారు. తక్షణమే ఫలితాల ప్రకటన ఆపకపోతే ఎస్సీ నిరుద్యోగుల అగ్రహానికి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించకుండానే మాలల ఒత్తిడికి ఉద్యోగ నోటిఫికేషన్‌లను విడుదల చేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ ద్వారా మాత్రమే ఉద్యోగం నోటిఫికేషన్లను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాబోయే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నోటిఫికేషన్ వెనక్కి తీసుకోకపోతే ఈనెల 16వ తేదీన స్టేషన్ ఘన్పూర్‌లో జరిగే కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతిసాగర్, బొడ్డు ప్రభుదాస్, చిలుక విజయరావ్, రవి, పుట్ట ప్రశాంత్, సది, బొడ్డు రమణాకర్, ఎండీ శంషొద్దీన్, చిలుక రాజు, కొట్టే శంకర్, మాచర్ల బాబు, నక్క రమేష్, జన్ను రాజు, మునిగాల కరియప్ప, పుట్ట ప్రణయ భాస్కర్, శ్రీధర్, పాల్గొన్నారు.



భీమదేవరపల్లి : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రేణికుంట్ల బిక్షపతి హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామిలు అన్నారు మండలంలోని ముల్కనూర్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష సోమవారం చేపట్టారు. గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 నియామకాలు ఎస్సీ వర్గీకరణ పూర్తి అయిన తర్వాతే చేపట్టాలన్నారు. చాలా ఏళ్లుగా మాదిగ మాదిగ ఉపకులాలు ఎస్సీ రిజర్వేషన్లు లేకపోవడంతో అన్యాయానికి గురి అయ్యాయి అన్నారు నియామకాల ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెప్పియాల ప్రకాష్ కడారి ప్రభాస్ వేల్పుల పాపక్క ఐలపాక స్వామి తాడూరి చిరంజీవి మట్టెడ లింగయ్య తూముల స్వామి గడిపే అరుణ్ కుమార్ పాల్గొనగా జేఏసీ చైర్మన్ దేగల సారయ్య బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్ సంఘీభావం తెలిపారు.

18న కెయులో యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యాయులు బి. నరసింహారావు

కె.యు. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో మార్చి 18న "యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని పిడిఎస్‌యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు తెలిపారు.సోమవారం పి.డి.ఎస్.యు. కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నాల్లో యు.జీ.సి. నూతన ముసాయిదా రూపొందించి, భారత రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో పొందుపరిచిన విద్యారంగాన్ని తన గుప్పెట్లోకి తీసుకొని విద్య రంగాన్ని పూర్తిగా కాషాయీకరించడమే కాకుండా ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగించే కుట్రలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని, వైస్ ఛాన్సలర్‌ల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాసే యూజీసీ నూతన ముసాయిదాను రద్దు చేస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత 13ఏండ్లుగా యూనివర్సిటీలో శాశ్వత ప్రతిపాదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విశ్వవిద్యాలయాల విద్య



వ్యవస్థ నిర్వహణ అగమ్య గోచరంగా తయారైందన్నారు. నాణ్యమైన బోధన, పరిశోధనల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడా నిధులు కేటాయించక పోవడంతో విశ్వవిద్యాలయాలు తీవ్ర సంక్షోభంలో కోరుకుపోయి మూసివేత దిశగా పయనిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 18న కేయూలో నిర్వహించే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, దేశంలోని వివిధ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతినిధులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బి. బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి. కావ్య, రాష్ట్ర నాయకురాలు పి.అనూష, నాయకులు గణేష్, యాదగిరి, పెరియార్, సౌమ్యసాధన, శ్రీజ, చారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-పరకాల

పరకాల పట్టణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్ల రూపాయల మంజూరు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో విద్యా వెలుగులు నింపడం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం విద్యకు పెద్ద పీటేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్ అన్నారు. యంగ్ ఇండియా స్కిల్ పథకంలో భాగంగా పరకాల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం మంజూరు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి ,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, మండల అధికార ప్రతినిధి ఎంఏ గఫూర్, జిల్లా నాయకులు కక్కెర్ల రాజు, మార్క రజినికర్, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ సర్పంచ్ లు, కంచే రవికుమార్,సొసైటి మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్,పర్వతగిరి రాజు,వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్ పెద్దాపూర్ సొసైటీ ఉపాధ్యక్షులు అంబటి రాజస్వామి, ఎంకతాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని హౌజుబుజుర్గు గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి దామెర రాజు ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుమలత రజనీకర్, ఉపాధ్యక్షుడు బషీర్, యూత్ అధ్యక్షుడు షరీఫ్, మండల కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మౌల, బొబ్బిలి, ఎండీ కరీం, నైమత్ ,అక్బర్, సీతయ్య ,తదితరులు పాల్గొన్నారు

దామెర : దామెర మండలంలోని దామెర, ఊరుగొండ గ్రామాల్లోని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు పోలే పాక బిక్షపతి, దురిశెట్టి బిక్షపతిల ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచులు జక్కుల రవీందర్, జన్ను రామచందర్, ఏఎంసీ డైరెక్టర్ లక్కిడి సుజాత రాజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్,పోతుల కొమ్మాలు,సదిరం పోశయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్‌మాదిగ

నవతెలంగాణ-పరకాల

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం పరకాల పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి పెండల సురేష్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను ఉద్దేశించి శంకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేసే వరకు అన్ని ప్రభుత్వ నియమకాలు నిలిపి వేయాలన్నారు. త్వరలో జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలువేరు ప్రవీణ్ మాదిగ, ఉపాధ్యక్షులు కొమ్ముల చిరంజీవి, చిలువేరు నరేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి హనుమకొండ విజయ్‌కుమార్ మాదిగ, కామరెడ్డిపల్లె గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల రాజశేఖర్ మాదిగ, నాగారం గ్రామ శాఖ అధ్యక్షుడు ఇనుముల కృష్ణ మాదిగ, పోచారం గ్రామశాఖ అధ్యక్షుడు దొమ్మడి సురేంద్ర మాదిగ, మల్లక్కపేట గ్రామ శాఖ అధ్యక్షుడు మంగళపల్లి రాజు మాదిగ, వెంకటాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలువేరుభాను మాదిగ, మాదిగ యువసేన మండల కన్వీనర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణలోని సమస్యలను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చాలని నిరసిస్తూ రిలే దీక్షలు నిరసన కార్యక్రమాలు ఆత్మకూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నద్దునూరి రఘు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎఫ్ ,ఎంఎస్పి, ఎంఈపి అనుబంధ సంఘాల నాయకులు కలిసి రిలే దీక్ష నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ జిల్లా నాయకులు అరిసం స్వామి హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో ఉన్న సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి, చట్టబద్ధత కల్పించి అది అమలు చేసే వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిలే దీక్షల్లో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు నాగెల్లి రాజు, మండల ఉపాధ్యక్షులు రాజేష్, జిల్లా నాయకులు అర్షం బలరాం,అర్షం సుధాకర్, అర్షం రాజేందర్, సన్నీ అరవింద తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల పొలం బాట

నవతెలంగాణ-భీమదేవరపల్లి : ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ హనుమకొండ రూరల్ డివిజన్ పరిధిలోని భీమదేవరపల్లి సెక్షన్ కొత్తపెల్లి గ్రామ శివారులో రైతుల పొలాల్లో విద్యుత్ శాఖ సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వంగిన స్తంభాలు, మనుషులకు తాకేలాఉన్న తీగలు, ట్రాన్స్ఫార్మర్ల వద్ద అపాయం జరగకుండా సరి చేశారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మణ్‌నాయక్ లైన్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌నాయక్, లైన్‌మెన్లు విజయ్‌కుమార్ బాలరాజు అసిస్టెంట్ లైన్‌మెన్లు మల్లేష్ శ్రీనివాస్ లక్ష్మీనారాయణ ప్రకాష్ అనిల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దామెర : రైతులకు మెరుగైన ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కారించే కార్యక్రమం విద్యుత్ అధికారుల పొలం బాట అని హన్మకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ సామ్య నాయక్ తెలిపారు. సోమవారం దామెర మండల పరిధిలో పొలం బాట కార్యక్రమాలు చేపట్టి 62 వంగిన స్థంబాలు, 220స్పాన్స్ లూజ్‌లైన్లు సరిచేశామని, స్థంబాలు ఏర్పాటు చేశామని డి.ఈ తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్లు ఫెయిల్ కాకుండా ఎర్తింగ్ ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నామని,మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహించి చైతన్యం కలిపిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పరకాల సబ్ డివిజన్ ఏడీఈ జె దేవేందర్, దామెర ఏఈ గుర్రం. రమేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



'తాళ్ల పద్మావతి'లో ఫాల్కనర్ యూనివర్సిటీ అమెరికా అధికారుల సందర్శన

నవతెలంగాణ ఎన్జీవోస్ కాలనీ

ఫాల్కనర్ యూనివర్సిటీ అమెరికా అధికారులు సోమవారం తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల మార్పిడి, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థుల ప్రత్యక్ష ప్రవేశాలు, అభివృద్ధి కార్యకలాపాల కోసం రెండు సంస్థల మధ్య సహకారం కోసం ఫాల్కనర్ యూనివర్సిటీ యూఎస్ఏ ప్రొఫెసర్లు, అధికారులు ఖాజీపేటలోని తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. క్యాంపస్‌లో సందర్శించి స్పాట్ అడ్మిషన్లు ఇచ్చినందుకు ఫాల్కనర్ సిబ్బందికి తాళ్ల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ తాళ్ల మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు. ఫాల్కనర్ యూనివర్సిటీ అమెరికాతో ఒప్పందం ద్వారా పరిశోధన కార్యకలాపాలను అన్వేషించడానికి, మెరుగుపరచడానికి తాము అన్ని రకాల చర్యలు, పరిశోధన కార్యకలాపాలను తీసుకుంటామని ఆయన ధృవీకరించారు. వాల్కున్నర్ యూనివర్సిటీ ప్రతినిధులు కేసీ ఓక్లీ, జస్టిన్ బాండ్ ముఖ్యంగా వాళ్లకున్నర్ యూనివర్సిటీ, సాధారణంగా అమెరికాలో ఉన్నత విద్యా అవకాశాల గురించి విద్యార్థులతో సంభాషించారు. దాదాపు 25మంది విద్యార్థులు ప్రవేశ లేఖలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ తాళ్ల వంశీ, చైతన్య, డాక్టర్ తాళ్ల వరుణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేలు, డాక్టర్ విజయలక్ష్మి, అఫ్జలున్నీసా, మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, అజిత్ కుమార్, అహ్మద్,విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
మంగళవారం మార్చి 11, 2025
www.navatelangana.com

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-శాయంపేట



రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి, మాందారి పేట, కొత్తగట్టు సింగారం, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, నేరేడుపల్లి, కాట్రపల్లి, వసంతాపూర్, గంగిరేణిగూడెం గ్రామా ల్లో సిసి రోడ్లను. బీటీ రోడ్డు పనులను, గట్లకానిపర్తి గ్రామంలో ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో శాయంపేటలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మిషాదీ, ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఆయన పంపించేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యర్తలు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎంపీఓ పాక శ్రీనివాసులు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని దౌలత్‌నగర్, మాల్యా తండాలలో ఉన్న వైకుంఠ దామాలకు మౌళిక వసతులు కల్పించాలని ఎంపీఓ పాక శ్రీనివాసులు సూచించారు. ఈ క్రమం లో వైకుంఠ దామాలను సందర్శించి ఆయా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.ఈ వైకుంఠ దామాలకు పారిశుధ్యం, నీటివసతి, విద్యుత్.. వసతులు కలిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పంచాయతి కార్యదర్శులు. రఘు,విక్రమ్, రాజు, ఎంపీడబ్ల్యూలు ఉన్నారు.



వేగవంతంగా ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్

వేగవంతంగా ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం వివిధ విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్ -23, హెల్త్, సానిటేషన్10, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ)11,టౌన్ ప్లానింగ్38, మంచినీటి సరఫరా 7,హార్టికల్చర్01 మొత్తం 90 వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ లక్ష్మా రెడ్డి, ఇన్చార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకం ద్వారా శాయంపేటకు బస్సు

నవతెలంగాణ-శాయంపేట

మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ ప్రవేశపెట్టిన ఇందిర మహిళ శక్తి పథకం ద్వార శాయంపేట సురేఖ మండల సమాఖ్యకు ఆర్టీసీ బస్సును మంజూరు చేసినట్లు ఏపీఎం శ్రీధర్రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 8వ తేదిన హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి బస్సును ప్రారంభించి పరకాల ఆర్టీసీ డిపోకు కేటాయించారని ప్రతి నెలా అద్దె రూపంలో రూ.77వేల 200 సురేఖ మండల సమాఖ్యకు చెల్లిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మండల సమాఖ్యకు రూ.30లక్షలు అందజేయగ మిగితా ఖర్చులు సమాఖ్య భరించాల్సి ఉంటుందని తెలిపారు శాయంపేట మండలానికి అరుదైన అవకాశం కల్పించదని అధ్యక్షురాలు కర్రు శిరిష, కార్యదర్శి అబేద, కోశాధికారి లావణ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వాతావరణంలో మార్పులు.. ప్రబలుతున్న విష జ్వరాలు !

- దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజల ఇక్కట్లు

-అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ల సూచనలు

నవతెలంగాణ-ఖానాపురం

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అన్ని కాలాలను ప్రస్తుతం ఒకే రోజులలో చూసే పరిస్థితి నెలకొన్నది. కాలాలతో తేడా లేకుండా ప్రకతిలో జరిగే మార్పు వలన అరుదుగా జలుబు దగ్గు జ్వరాలతో పాటు కంటి ఇన్ఫెక్షన్లు కూడా ఎదురవుతున్నాయి. వీచే గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గి అనేక అనారోగ్య సమస్యలు ఎదురయ్యే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. వృద్ధులు, చిన్నపిల్లలకు విష జ్వరాల ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా మండలంలోని పలు గ్రామాలలో జలుబు దగ్గు లతో పాటు విష జ్వరాలు సైతం వాతావరణ మార్పులలో కారణంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కొన్ని గ్రామాలలో ప్రజలు జలుబు, దగ్గుతో అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ ఆస్పత్రులలో ప్రజలు విష జ్వరాలతో కిక్కిరిసిన పరిస్థితిని వీక్షిస్తున్నాం. వాతావరణంలో ఏర్పడిన మార్పులకు అనుగుణంగా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆహార పదార్థాలను వేడిగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలని, గోరువెచ్చని నీటిని సేవించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని



తెలుపుతున్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ఆవాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేస్తున్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దని తప్పనిసరిగా డాక్టర్లను సంప్రదించాలని కోరుతున్నారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి



వీస్తున్న గాలితో గ్రామాలలో దగ్గు జలుబు జ్వరం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వైద్యులు అప్రమత్తమై గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించి పరీక్షించాలి. అందుకు అనుగుణంగా మందులు పంపిణీ చేసి విష జ్వరాలు ప్రబలకుండా అరికట్టాలి.

వెంకటనారాయణ (బుధరావుపేట)

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి



డెంగ్యూ మలేరియా విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు గ్రామాలలో పారి శుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వ హించాలి. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు చేపట్టాలి. గ్రామాలలో దోమల వ్యాప్తి అధికంగా ఉన్నందున దోమల మందు పిచికారి చేపించాలి.

గులాంబాబా (ఖానాపురం)

సర్వే చేసి.. ప్రజలకు వైద్య సేవలు అందిస్తాం



వాతావరణంలో మార్పుల జరిగిన విషయం వాస్తవమే. అందుకు అనుగుణంగా గ్రామాలలో సర్వే చేపిస్తాం. దాంతోపాటు జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్న గ్రామాలలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తాం. ప్రజల అప్రమత్తంగా ఉండి వైద్య అధికారులు సూచించిన సూచనలను పాటించాలి. సాధారణ జ్వరాలను సైతం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలి.

మండల వైద్యాధికారి జ్యోతి

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకై ఉద్యమించాలి

నవతెలంగాణ-నర్సంపేట

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధన కోసం ఉద్యమించాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శి ఎండీ.ఫరిదా, బిట్ర స్వప్న అన్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వ హించి ఆమె చిత్ర పట్టానికి పూలమాలతో నివాళ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మనువాదం అత్యధిక ప్రజలను చదువులకు దూరం చేసిందన్నారు. ఈ తరుణలో సావిత్రిబాయి పూలే నాగరిక సమాజానికి అక్షర దివిటి అందించిన సామాజిక విప్లవ మాతృమూర్తి అని కొనియాడారు. సావిత్రిబాయి పూలేను సమాజం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె ఆశయాలకు తిలోదకాలు ఇస్తూ మోడీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరిట మహిళలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రలు చేస్తుందన్నారు. ఆ ముసుగులో మనువాదం ప్రవేశపెడుతుందని విమ ర్శించారు. మనువాదానికి వ్యతిరేకంగా మహిళలు పోరా డాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కోశాధికారి వజ్జంతి విజయ, రుద్రారపు లక్ష్మీ, పట్టణ నాయకులు ఉదయగిరి నాగమణి, గణిపాక ఇంద్ర, బి.లక్ష్మీ, జెట్టి విజయలక్ష్మీ, తోటకూరి రజిత, పాశం శ్రీలత, ఉదయగిరి సరిత, పంబీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 128 వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు. ఆర్



ఎస్ పి వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరు పట్ల అంజయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పోలిట్‌బ్యూరో సభ్యులు ఈరేలి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జనగం చంద్రమౌళి గాదే గణేష్ చెరుపల్లి అశోక్ మరుపట్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు

నల్లబెల్లి : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేరాలంటే బీసీలు అధికారంలోకి రావాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో తడుక అశోక్, పరికి కోరనేయులు, నాగలి ప్రకాష్, ఓదెల రవి, మేడిపల్లి రాజు, కోల లింగయ్య, తంగేళ్ల వేణు, సమ్మయ్య, భూష కుమారస్వామి, హరీష్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

షీ టీం ఎస్ఐ విద్యాసాగర్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, యువత మహిళల పట్ల దాడులపై, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని వరంగల్ షీ టీం ఎస్ఐ విద్యాసాగర్ అన్నారు. వరంగల్ పోలీసు కమీషనర్ ఆదేశాల మేరకు సోమవారం షీ టీమ్ వరంగల్ పట్టణంలోని కాకతీయ పారామెడికల్ కాలేజీలో మహిళపై హింస, డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. షీ టీమ్ సైబర్ నేరాలపై పటిష్టంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్ కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల వల్ల మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఎటిఎం కార్డ్ వివరాలు, ఒటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దని, అపరిచితులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని, మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ పారామెడికల్ కళాశాల సిబ్బంది, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, మహిళా కానిస్టేబుల్ పూర్ణ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.